చూసిన కనులకు చూడముచ్చట



రాజమహేంద్రవరం సాంస్కృతికం: ఆధ్యాత్మిక నగరి శరన్నవరాత్రి వేడుకకు సిద్ధమవుతోంది. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయం వద్ద శ్రీదేవి ఉత్సవ కమిటీ నిర్వహణలో ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. బుధవారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని మేళతాళాలతో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చి యంత్ర ప్రతిష్ఠాపన చేస్తారు.

కన్నతండ్రా.. కాలయముడా?

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి అంటూ ఇంటిల్లిపాదీ మురిసిపోతారు. అలాంటి శిశువును తండ్రే చేతులతో గొంతు నులిమి గోడకేసి కొట్టాడు. శిశువు ఊపిరి ఆగడానికి కారణమయ్యాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. కాకినాడ ఒకటో పట్టణ సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం.. బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన కేతా శివమణికి గతంలోనే వివాహమైంది. భార్యతో విభేదాలు రావడంతో వేరుగా జీవిస్తున్నారు. ప్రస్తుతం కాకినాడలో ఉంటున్నారు. అతడికి కాకినాడకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఆమెకు గతంలోనే పెళ్లి కాగా భర్తతో విడిపోయింది. శివమణి, ఆ మహిళ నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. వీరికి 35 రోజుల క్రితం ఆడ శిశువు పుట్టింది. బాలిక పుట్టడంతో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. గొడవ పెరగడంతో శివమణి.. శిశువు గొంతు నులిమి, గోడకేసి కొట్టడంతో మృతిచెందింది.

మహాత్మా.. నీ పథంలో

గాంధీ జయంతి నేడు

ఆ మహనీయుని ప్రతి మాట నేటి తరానికి స్ఫూర్తిమంత్రం.. ప్రతి సిద్ధాంతం ఆచరణాత్మకం..'అహింస' అనే ఆయుధంతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన జాతిపిత గాంధీజీ.. ప్రపంచవ్యాప్తంగా పరిమళించిన ఆయన కీర్తి ఎందరికో స్ఫూర్తి.. ఆయన లాంటి వ్యక్తి రక్తమాంసాలతో ఈ భూమిపై తిరిగారంటే తర్వాతి తరాలు నమ్మకపోవచ్చ'ని ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్నారంటే బాపూ వేసిన ముద్ర ఏ స్థాయిదో అర్థం చేసుకోవచ్చు.. గాంధీ చూపిన బాట నాటికీ.. నేటికీ.. ఎన్నటికీ మార్గదర్శకమే. ఆయన జయంతి వేళ.. తూర్పుతో అనుబంధం.. ఆ అడుగుజాడల్లో నడుస్తున్న ప్రాంతాల గురించి అవలోకిస్తే..

'దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు.. గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది'..

- స్వచ్ఛత, శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువత అందులో భాగస్వాములు కావాలి.
- దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉంది.
- మనిషి ప్రకృతిలో మమేకం కావాలి.. అందులో అన్ని ప్రాణులకు భాగస్వామ్యం ఉందనే విషయం మరువకూడదు. మన అవసరాల కోసం ప్రకృతిని ధ్వంసం చేయకూడదు. అది భావితరాలకు శ్రేయస్కరం కాదు.'
- 'హింసను అహింసతో ఎదుర్కోవాలి. చెడును నిర్మూలించడానికి ఆయుధాలు పడితే జరిగేది రెండు దుష్టశక్తుల మధ్య యుద్ధం మాత్రమే..'
- 'ఈ ప్రపంచంలో నువ్వు చూడాలనుకుంటున్న మార్పు.. మొదట నీతోనే మొదలవ్వాలి.'

ఈనాడు, కాకినాడ



రాజోలులో గాంధీ బసచేసిన గృహం

నాటి జ్ఞాపకాలతో గాంధీ హౌస్

మామిడికుదురు, రాజోలు: స్వాతంత్య్ర స్ఫూర్తిని ప్రజల్లో మరింత రగిలించేందుకు గాంధీ 1929 మే 5న తన భార్య కస్తూరిబాతో కలిసి రాజోలు వచ్చారు. పొన్నాడ సూర్యారావు ఇంట్లో రెండు రోజులు ఉన్నారు. స్వరాజ్య సాధన కోసం ప్రజల్లో ఉత్తేజాన్ని నింపే ఉపన్యాసాలు చేశారు. ఆ గృహమే గాంధీ హౌస్‌గా నేటికీ ఆకట్టుకుంటోంది. అదే పేరు మీదుగా న్యాయవాది పొన్నాడ హనుమంతరావు పుస్తకాన్ని ప్రచురించారు. ఇంటి ఎదుట నిలువెత్తు గాంధీ విగ్రహం, ఆయన విశ్రాంతి తీసుకున్న గది, కస్తూరిబా సందర్శించిన ప్రదేశం ఉన్నాయి.

కిర్లంపూడి వచ్చి...

కిర్లంపూడి: ఉప్పు సత్యాగ్రహ యాత్రలో భాగంగా కిర్లంపూడి గాంధీ వచ్చారు. కొక్కొండ వెంకట రామశేషగిరిరావు పంతులు ఇంటిలో మహాత్ముడు భోజనం చేశారు. ఉద్యమం కోసం శేషగిరిరావు భార్య కృష్ణవేణమ్మ బంగారు కాసుల పేరు, వెండి నాణేలు, కొంత నగదు అందజేశారు.



విగ్రహాల చెంత ఆశ్రమం ప్రతినిధులు, బాల్వాడీ పిల్లలు

ఆశ్రమంలో నిత్యపూజలు

సీతానగరం: స్వాతంత్య్ర సంగ్రామంలో స్వరాజ్య స్ఫూర్తిని రగిలించి.. గోదావరి జిల్లా వాసులకు దేశభక్తిని నూరిపోసి.. ఎన్నో సేవా కార్యక్రమాలకు నిలయంగా మారింది సీతానగరంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమం. 1924 నవంబరు 9న బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం గౌతమి సత్యాగ్రహం పేరుతో ఆశ్రమాన్ని స్థాపించారు. ఆ సమయంలోనే గాంధీ, కస్తూర్బా విగ్రహాలను ఏర్పాటుచేసి నిత్యపూజలు చేసేలా బైలాలో రాయించారు. స్వాతంత్య్ర సమరానికి చురుకైన కార్యకర్తలకు శిక్షణ నిర్వహిస్తూనే, అనాథలైన మహిళలకు ఎన్నెన్నో ఉపాధి అవకాశాలతో ఆశ్రమాన్ని తీర్చిదిద్దారు. కుట్టుశిక్షణ, పట్టుతేనె పరిశ్రమ, బాల్వాడీ, జెండాల తయారీ శిక్షణాంశాలను యువతకు అందిస్తుంటారు. 1929, 1933 సంవత్సరాల్లో గాంధీ రెండు పర్యాయాలు వచ్చి ఆశ్రమంలో ఉన్నారు. బసచేసిన ప్రాంతాన్ని బాపూ కుటీరంగానూ, ఆశ్రమాన్ని కస్తూర్బాగాంధీ పేరుతో మార్చారు. దేశభక్తి గీతాలు ఆలపించి నిత్యపూజలు చేసిన తర్వాతనే కార్యక్రమాలు మొదలవుతాయి. పేదవర్గాలకు చెందిన బాల్వాడీ పిల్లలకు నెలకు రూ.50 తీసుకుని చదువుతో పాటు, ఉచిత భోజనం పెడుతుంటారు. ఆశ్రమం ఏర్పడి నవంబరు 9 నాటికి వందేళ్లు పూర్తవుతుందని ప్రతినిధి జి.సుశీల 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ఈ పల్లెలు మద్యానికి దూరం

కిర్లంపూడి, తుని గ్రామీణం: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో ఉన్న గ్రామం ముక్కొల్లు. 3900 మంది జనాభా అక్కడ ఉన్నారు. గత దశాబ్ద కాలంగా ఇక్కడ మద్యం ఊసే లేదంటే అతిశయోక్తి కాదు. అంతకుపూర్వం సారా తయారీ, బెల్టు షాపులు, మందుబాబుల వీరంగం, అరెస్టులు వంటివి ఉండేవి. ఎలాగైనా ఇక్కడి పరిస్థితులను మార్చాలని మహిళలు పెట్టుకొన్న సంకల్పం ఓ మార్పునకు దారితీసింది. గ్రామ పెద్దలు, యువత తోడవడంతో మద్యం అమ్మేవారిని, సారా తయారీదారులను నియంత్రించారు. ఇందుకు రెండేళ్లు పట్టింది. 2011 నుంచి మద్యరహిత గ్రామంగా పేరొందింది. ● తుని మండలం వి.కొత్తూరు కొన్ని దశాబ్దాలుగా మద్యం విక్రయాలు లేని గ్రామంగా గుర్తింపు పొందింది. ఎవరైనా మద్యం, సారా, మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే గ్రామ కమిటీ సభ్యులు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

దస్త్రాల దహనం కేసుకు కదలిక

■ దృష్టిసారించిన మంత్రి లోకేశ్ ■ పూర్తి వివరాలివ్వాలని అధికారులకు లేఖ

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం గ్రామీణం

ధవళేశ్వరంలోని పోలవరం పరిపాలనా కార్యాలయంలో సంచలనం కలిగించిన దస్త్రాల దహనం వ్యవహారంలో వాస్తవాలు నిగ్గుతేల్చే దిశగా అడుగులు పడుతున్నాయి. బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఇటీవల నిర్వాసితులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన.. అధికారుల పాత్రతో పాటు, దహనమైన దస్త్రాల పూర్తి వివరాలను నిర్దేశిత సమయంలో అందించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించిన లేఖ మంత్రి పేషీ నుంచి ఇటీవల పోలవరం పరిపాలనా కార్యాలయానికి చేరింది. దీంతో అధికారులంతా ఉరుకులు పరుగులు తీస్తున్నారు. అంశాలవారీగా అసలేం జరిగిందో బదులిచ్చేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

బెడిసికొట్టిన బెయిల్ ప్రయత్నం

దస్త్రాల దహనంలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి.. అరెస్టు నుంచి తప్పించుకొనేందుకు ముందస్తు బెయిలు కోసం దరఖాస్తు చేసుకోగా.. ఆ ప్రయత్నం బెడిసికొట్టినట్లు సమాచారం. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చట్టం ప్రకారం కేసు నమోదైంది. ఘటనకు రెండురోజుల ముందు తీసుకువచ్చిన కొత్త బీరువాలు ఇప్పుడు చర్చలో నిలిచాయి. వాటిని దళారుల నుంచి తీసుకువచ్చారా? లేదా కొనుగోలు చేశారా? అనేదానిపై విచారణ జరుగుతోంది. మూడు బీరువాలు అనుమతులు పొందకుండానే తీసుకురావడం.. ఉన్నతాధికారులంతా సెలవుపై ఉండటం.. పరిహారానికి సంబంధించిన 10 యూనిట్ల ఫైళ్లను బీరువాలలో సర్దమని సిబ్బందికి ఆదేశాలివ్వడం.. ఇలా అన్నీ అనుమానాస్పదంగా మారాయి.

శాశ్వత భద్రత అవశ్యం

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పోలవరం ప్రాజెక్టులోని అన్ని యూనిట్లకు సంబంధించిన దస్త్రాలు శాశ్వతంగా భద్రపరచాల్సిందేనని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్లు చెబుతున్నారు. నిర్వాసితులకు భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన పరిహారాలు అందిన తరువాత దస్త్రాలను భద్రపరుస్తారు. పరిహారానికి సంబంధించి వివాదాలు నెలకొంటే ఇవి కీలక ఆధారమవుతాయి. కోర్టు కేసులు, సమాచార హక్కు చట్టంలో సమాధానాలు పంపేందుకు ఈ రికార్డులను 50 ఏళ్ల పైబడి సంరక్షించాల్సి ఉంటుంది.

పింఛన్ల పంపిణీలో చేతివాటం

గ్రామ సర్వేయర్‌పై సస్పెన్షన్ వేటు

రాజమహేంద్రవరం కలెక్టరేట్, ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడిన గ్రామ సర్వేయర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. రాజమహేంద్రవరం గ్రామీణ మండలం కోలమూరు-2 సచివాలయానికి చెందిన సర్వేయర్ కె.వెంకటాచారిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ మంగళవారం కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. లబ్ధిదారులకు నేరుగా ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ ప్రక్రియ చేపట్టేందుకు ఆయా క్లస్టర్ల పరిధిలో పలు ప్రభుత్వ శాఖల సిబ్బందికి బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. పింఛను డబ్బులు పంపిణీ చేసే సమయంలో వెంకటాచారి 13 మంది లబ్ధిదారులకు రూ.300 చొప్పున తగ్గించి ఇచ్చారని విచారణలో రుజువు కావడంతో తక్షణం అతడిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పింఛన్ల పంపిణీ విషయంలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.



దసరాకు ప్రత్యేక బస్సులు

సాధారణ ఛార్జీలతోనే ప్రయాణం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

దసరా పండగను పురస్కరించుకుని జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. హైదరాబాద్ నుంచి జిల్లాలోని స్వస్థలాలకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు సాధారణ టికెట్ ఛార్జీతో నడిపేందుకు నాలుగు డిపోల నుంచి 37 ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేస్తున్నారు. వీటిలో సూపర్ లగ్జరీ 27, అల్ట్రా డీలక్స్ 4, ఎక్స్‌ప్రెస్‌లు 6 ఉన్నాయి. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రతి రోజూ హైదరాబాద్‌కు 8 షెడ్యూల్ సర్వీసులు నడుస్తున్నాయి. పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనంగా నాలుగు రోజులపాటు 37 బస్సులు నడిపేందుకు అధికారులు నిర్ణయించారు. 11వ తేదీన ప్రయాణికుల డిమాండ్ ఎక్కువ ఉండే అవకాశం నేపథ్యంలో ఆ ఒక్కరోజే 15 ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నింటికీ ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని అధికారులు తెలిపారు. దసరా అనంతరం కూడా తిరుగు ప్రయాణికుల కోసం హైదరాబాద్‌కు బస్సులు నడుపుతారు. వీటితోపాటు రాజమహేంద్రవరం నుంచి విజయవాడ, విశాఖకు రద్దీకి అనుగుణంగా అదనంగా సర్వీసులు ఉంటాయి.

హైదరాబాద్‌కు సర్వీసులు ఇలా..

తూర్పుగోదావరి జిల్లాలోని డిపోలు	ప్రత్యేక బస్సులు	ఏ రోజున ఎన్ని 8న	9	10	11
రాజమహేంద్రవరం	17	03	03	05	06
గోకవరం	06	0	01	02	03
కొవ్వూరు	09	0	02	03	04
నిడదవోలు	05	0	01	02	02

విశాఖ ఉక్కు పరిరక్షణకు దీక్ష



దీక్షలో పలు సంఘాల నాయకులు, విద్యార్థులు

శ్యామలా సెంటర్(రాజమహేంద్రవరం): విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే విధానాలు మానుకోవాలని, సెయిల్‌లో విలీనం చేసేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని విద్యార్థి, యువజన సంఘాలు ఆధ్వర్యంలో మంగళవారం నందం గనిరాజు సెంటర్లో ఉక్కు పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడుతూ తక్షణమే విశాఖ ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ తదితర సంఘాల నాయకులు దీక్షలో పాల్గొన్నారు.

పండగ వేళ ప్రత్యేక నిఘా



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిషోర్

దానవాయిపేట(రాజమహేంద్రవరం): దసరా వేడుకల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని ఎస్పీ డి.నరసింహకిషోర్ పేర్కొన్నారు. నగరంలోని దేవీచౌక్ వద్ద ఏర్పాటు చేస్తున్న అమ్మవారి ఉత్సవ పనులను ఎస్పీ మంగళవారం పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. అశ్లీల నృత్యాలు ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ రమేష్‌బాబు, సీఐలు వి.అప్పారావు, శ్రీనివాసరావు, బాలశౌరి తదితరులు ఉన్నారు.

● నేడు ఎంపీ పురందేశ్వరి పర్యటన

దేవీచౌక్(రాజమహేంద్రవరం): భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 9 గంటలకు ద్వారకా తిరుమలలో స్వామివారి దర్శనానంతరం గోపాలపురం నియోజకవర్గం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలు, సభలో పాల్గొంటారు. ఉదయం 11.30 గంటలకు రాజానగరం జీఎస్‌ఎల్ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రిలో మెడికల్ అండ్ సర్జికల్ క్రిటికల్ యూనిట్ ప్రారంభోత్సవంలో, మధ్యాహ్నం 3 గంటలకు రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి కుష్ఠురోగుల యోగ క్షేమాలు తెలుసుకుంటారు.

● 3 నుంచి టెట్

శ్యామలా సెంటర్(రాజమహేంద్రవరం): ఏపీ టెట్ ఈనెల 3 నుంచి 21 వరకు రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో నిర్వహించనున్నట్లు డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందుగా అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

125 మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం నూతన పాలసీ అమలు చేయడం జరుగుతుందని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్య తెలిపారు. రాజమహేంద్రవరంలోని బొమ్మూరు వద్దనున్న ఏపీఎస్‌బీసీఎల్ డిపో ఆవరణలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జిల్లాలోని నూతన పాలసీ ద్వారా మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రకటన విడుదల చేయడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 28, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల పరిధిలో ఏడు, జిల్లాలో ఇతర పంచాయతీల పరిధిలో 90.. మొత్తంగా 125 మద్యం దుకాణాలకు ప్రకటన విడుదల చేశామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లా వారైనా ఇతర జిల్లాల్లోని మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీతో దరఖాస్తు స్వీకరణ గడువు పూర్తవుతుందన్నారు. 10న దరఖాస్తుల పరిశీలన, 11న లాటరీ విధానంలో దుకాణాల కేటాయింపు జరుగుతుందన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య

పుష్కరాల నాటికి పచ్చని అందాలు

ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధికి ప్రతిపాదనలు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

రానున్న పుష్కరాలకు రాజమహేంద్రవరాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దాలని ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి. రహదారుల విస్తరణతో పాటు సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇందుకోసం ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలకు అవకాశం కల్పించాలని నగరపాలక సంస్థ భావిస్తోంది. నాసిక్, పుణె మాదిరి ఇక్కడా అభివృద్ధికి ప్రతిపాదనలు చేస్తున్నారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పటికే నగరంలో రహదారులకు ఆనుకుని ఆక్రమణలు, కాలువలపై నిర్మాణాలు తొలగిస్తున్న విషయం తెలిసిందే. రహదారుల వెడల్పుతో పాటు కూడళ్లకు వన్నెలందేలా గ్రీనరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకుగాను నగరంలో ప్రధాన రహదారులు, కూడళ్లు, పార్కులు ఆయా సంస్థలకు అప్పగిస్తారు. వారు సుందరీకరణలో పాటు పచ్చదన నిర్వహణ బాధ్యతలు చూడాలి. ఆ సంస్థలకు చెందిన లోగోలు, ప్రకటనలు ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తారు. గతంలో వెంకటేశ్వరనగర్ పార్కును రోటరీ క్లబ్, ఏవీఏ రోడ్డు చివర కూడలిని గెయిల్ సంస్థకు ఇదే తరహాలో అప్పగించారు.



అభివృద్ధి చేయనున్న పుష్కర ఘాట్ కూడలి

◆ ఎక్కడెక్కడంటే..

నగరంలో కంబాలచెరువు, దేవీచౌక్, జాంపేట, నందం గనిరాజు సెంటర్, కోటిపల్లి బస్టాండ్, డీలక్స్ సెంటర్, వై-జంక్షన్, పుష్కర ఘాట్ తదితర కూడళ్లు.. వాటికి అనుబంధంగా ఉన్న రహదారులను గుర్తించారు. ఈ రహదారులకు ఇరువైపులా పచ్చదనం ఏర్పాటు చేస్తారు.

కాలుష్య తీవ్రత తగ్గించేలా..

నగరంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా వాహన కాలుష్యం పెరుగుతోంది. రోడ్డుపై దుమ్ము, ధూళి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో పచ్చదనం పెంచేందుకు అడుగులు వేస్తున్నాం. నగర సుందరీకరణలో స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థల సాయం తీసుకుంటాం.

- కేతన్ గర్గ్, కమిషనర్

220 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు



బ్యానర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని 220 రైతు సేవా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ధాన్యం సేకరణకు సంబంధించి రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే బ్యానర్లను మంగళవారం జేసీ చిన్నరాముడు, డీఆర్వో నరసింహులు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాధికతో కలిసి ఆవిష్కరించారు. సేకరణకు సంబంధించి కలెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం. ◆ ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను రైతులే స్వయంగా సమకూర్చుకుంటే దానికయ్యే ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. ◆ ధాన్యాన్ని సంచుల్లో నింపడం, తూకం వేయడం, బస్తాలు కుట్టడం, వాటిని వాహనాల్లో ఎక్కించడం వరకు అయ్యే ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ◆ రైతులే హమాలీలను సమకూర్చుకుంటే లేబర్ ఛార్జీలను నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తారు. ◆ కల్లం నుంచి రైతులు కోరిన మిల్లులకు వాహనాల్లో ధాన్యం రవాణాకు అయ్యే ఖర్చులను కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ◆ రైతులే వాహనాలను ఏర్పాటు చేసుకుంటే దానికయ్యే ఛార్జీలను నేరుగా ఖాతాకు జమచేస్తారు.

గోనె సంచికి రూ.3.39: జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ ఒక్కొక్క గోనె సంచికి(40 కేజీలు) రూ.3.39, లేబర్ ఛార్జీలు క్వింటాకు రూ.17.17 చొప్పున, రవాణా ఖర్చులు స్థానికంగా నిర్ణయించిన రేటు ప్రకారం చెల్లిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకంటే ఎక్కువ వస్తే బయటకు విక్రయించుకునే స్వేచ్ఛ రైతులకు ఉందన్నారు. దళారుల ప్రమేయాన్ని నియంత్రించడం కోసం అమ్మకం వివరాలు మాత్రం తెలియజేయాల్సి ఉంటుందన్నారు.

ఆదర్శనీయుడు బాలయోగి

టి.నగర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన బాలయోగి ఆదర్శనీయుడని గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బాలయోగి జయంతి సందర్భంగా మంగళవారం కంబాలచెరువు పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ విలువలు కలిగిన రాజకీయాలకు బాలయోగి నాంది పలికారన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, పార్టీ నేతలు



పింఛను ఇచ్చేందుకు కేతావారి లంకకు వెళ్తున్న అప్పన్న సత్యవతి

98.43 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 98.43 శాతం పూర్తయింది. అక్టోబరు నెలకు సంబంధించి 18 విభాగాల్లో 2,39,021 మంది లబ్ధిదారులకు రూ.101.95 కోట్లు అందించాల్సి ఉండగా.. మంగళవారం రాత్రి 9.40 గంటల సమయానికి 2,35,260 మంది లబ్ధిదారులకు రూ.100.36 కోట్లు పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ మూర్తి తెలిపారు. మరో 3,761 మంది లబ్ధిదారులకు పింఛను సొమ్ము ఇవ్వాల్సి ఉందన్నారు.

గోదావరి లంకలోకెళ్లి అందజేత

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: గోదావరి మధ్యలో ఉన్న లంకల్లోకి వెళ్లి మరీ సిబ్బంది మంగళవారం పింఛను అందించారు. ఆల్కట్ గార్డెన్స్ ప్రాంతానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు గోదావరి నది మధ్యలో కేతావారి లంకలో ఉంటున్నారు. విషయం తెలుసుకున్న 45వ సచివాలయం హెల్త్ సెక్రటరీ అప్పన్న సత్యవతి పడవపై లంకకు వెళ్లి ఇద్దరు లబ్ధిదారులను కలిసి పింఛను అందజేశారు. ఈ విషయం నెట్టింట వైరల్‌గా మారింది.

జాడలేని చిరుత.. గుర్తించేందుకు రెండు బృందాలు



దివాన్‌చెరువు (రాజానగరం), న్యూస్‌టుడే: చిరుతపులి జాడ దివాన్‌చెరువు అభయారణ్యం, కడియం ప్రాంతంలోని నర్సరీలు, రావులపాలెం, గోదావరి నదీ తీరంలో.. ఎక్కడా కనిపించడం లేదని తూర్పుగోదావరి జిల్లా అటవీశాఖాధికారిణి ఎస్‌.భరణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తించేందుకు రెండు బృందాలు అడవి ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతున్నాయన్నారు. గత నెల 19న దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు ట్రాప్ కెమెరాలో నమోదైందన్నారు ఆమె.. 24వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో కడియం నుంచి వీరవరం వెళ్లే రోడ్డులోని దోసాలమ్మకాలనీ దగ్గర ఎస్‌ఎస్‌టీసీ నర్సరీలో పాదముద్రలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆ రోజే వర్షం పడటంతో పాదముద్రలు అస్పష్టంగా చెరిగి పోయాయన్నారు.

నేటి నుంచి పుష్కర వనంలోకి సందర్శకుల అనుమతి

గోదావరి మహాపుష్కర వనంలోకి బుధవారం నుంచి సందర్శకులను అనుమతిస్తున్నట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. చిరుత కదలికల నేపథ్యంలో గత నెల 10వ తేదీ నుంచి దివాన్‌చెరువు అభయారణ్యం, పుష్కరవనంలోకి అనుమతులు నిలిపేశారు. ప్రస్తుతం చిరుత జాడ కనిపించకపోవడంతో పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడా వికాస కేంద్రాల పనుల్లో కదలిక

రాజానగరం నియోజకవర్గం సీతానగరంలోని పువ్వాడ సత్యం మాజీ స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.2 కోట్లతో క్రీడా వికాస కేంద్రం మంజూరు చేసి రూ.25 లక్షలు విడుదల చేసింది. గుత్తేదారు ఉత్సాహంగా పనులు మొదలు పెట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నాలుగేళ్లపాటు వాటి గురించి పట్టించుకోలేదు. ఎన్నికల వేళ రూ.45 లక్షలు మంజూరు చేసి పూర్తి చేస్తున్నామంటూ హడావుడి చేసింది. పనులు పూర్తికాకుండానే ఈ ఏడాది మార్చి 24న శిలాఫలకంపై వైకాపా నేతల పేర్లు వేసి ప్రారంభోత్సవం పోటీపడి.. శాప్‌కు అప్పగించకుండానే ప్రారంభించేశారు. ఇటీవల వర్షాలకు ఎక్కడికక్కడ లీకేజీలతో క్రీడా వికాస కేంద్ర భవన నిర్మాణంలో డొల్లతనం బయటపడడంతో కలెక్టర్ వివరణ కోరారు.

- న్యూస్‌టుడే, సీతానగరం

వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో క్రీడారంగాన్ని నిర్లక్ష్యం చేసింది. అంతకు ముందున్న తెదేపా ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను పక్కన పెట్టేసింది. పలుచోట్ల క్రీడా మైదానాలు చిట్టడవిని తలపించేలా తయారైనా 'ఆడుదాం-ఆంధ్ర' పేరుతో దోపిడీకి పాల్పడింది. క్రీడలపై ఆసక్తి గల యువత కలలను చిదిమేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారుల ప్రతిభ వెలుగుచూసే నిర్మాణాలతో ఆటలాడుకొంది. నయాపైసా విదల్చకుండా గుత్తేదారులను ఇబ్బంది పెట్టి పనులు సైతం వదులుకునే పరిస్థితి తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడా వికాస కేంద్రాలు, మినీ స్టేడియం నిర్మాణాలపై దృష్టి పెట్టింది. నిలిచిపోయిన 36 క్రీడావికాస కేంద్రాలకు రూ.23 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు.



రాజమహేంద్రవరం నాగులచెరువు వద్ద అసంపూర్తిగా క్రీడా వికాస కేంద్రం పనులు

ఒక్కో కేంద్రానికి రూ.2 కోట్లు

2014-19 మధ్య తెదేపా అధికారంలో ఉన్న సమయంలో ప్రతి నియోజకవర్గంలోను క్రీడా వికాస కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించింది. మొదటి దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 చోట్ల క్రీడావికాస కేంద్రాలు, మూడుచోట్ల క్రీడా ప్రాంగణాల పనులు ప్రారంభించారు. కాకినాడ, ద్రాక్షారామ, సామర్లకోట, కొత్తపేట, రాజమహేంద్రవరం, దేవరపల్లి, పిఠాపురం, నిడదవోలు, కొవ్వూరు, దివాన్‌చెరువు తదితర చోట్ల ఒక్కో క్రీడా వికాస కేంద్రానికి రూ.25 లక్షలు చొప్పున విడుదల చేసి పనులు ప్రారంభించారు. అప్పట్లోనే సామర్లకోట, ద్రాక్షారామ, తుని కేంద్రాల నిర్మాణం పూర్తయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా క్రీడా వికాస కేంద్రాల పనులను పక్కన పెట్టేసింది. అప్పటికే పూర్తయిన ద్రాక్షారామ కేంద్రాన్ని ప్రారంభించడానికి చర్యలు చేపట్టలేదు. దేవరపల్లిలో 30 శాతం, నిడదవోలులో 16 శాతం, కొవ్వూరు స్విమ్మింగ్ పూల్ 25 శాతం పనులతో అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	క్రీడావికాస కేంద్రాలు	నిధులు (రూ.కోట్లు)
తూర్పుగోదావరి జిల్లా	04	8.5
కాకినాడ	03	6.5
అంబేడ్కర్ కోనసీమ	03	6.2

శాప్ ఇంజినీరింగ్ విభాగానికి బాధ్యతలు

క్రీడావికాస కేంద్రం పనుల పర్యవేక్షణ బాధ్యతలు ర.భ.తోపాటు వేర్వేరు శాఖలకు గతంలో అప్పగించారు. తాజాగా ఆయా శాఖలు తప్పించి శాప్ ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నారు. గతంలో క్రీడా వికాస కేంద్రం పూర్తిచేసిన శాప్ చేతికి రావాలంటే ఎక్కువ ప్రక్రియ ఉండేది. క్వాలిటీ కంట్రోల్ నివేదికలు వచ్చిన తర్వాతే పనుల పర్యవేక్షణ అప్పటి శాఖలు సీఎఫ్‌ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉండేది. అనంతరం బిల్లింగ్ ప్రారంభించి శాప్‌కు అప్పగించేవారు. శాప్ నుంచి మళ్లీ ఆయా జిల్లాల స్పోర్ట్స్ అథారిటీలకు అప్పగించేవారు.

వేగవంతం చేయిస్తున్నాం..

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన క్రీడా వికాస కేంద్రాల పనులు వేగవంతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. సీతానగరంలోని క్రీడావికాస కేంద్రం పనులు 90 శాతం పూర్తికావడంతో ముందుగా దాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. రాజమహేంద్రవరంలోని నాగులచెరువు వద్ద ఉన్న కేంద్రం పనులు పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. 6 నెలలు కాలవ్యవధిలోనే ఇవన్నీ పూర్తిచేసేలా శాప్ ముందుకెళ్తోంది.

- టీఎంఎం శేషగిరి, డీఎస్‌డీవో

రైల్వేలో ఆర్నెల్లకోసారి పోస్టుల భర్తీ జరగాలి

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రైల్వేలో ఆరు నెలలకోసారి ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ జరగాల్సిన అవసరం ఉందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్(ఎస్‌సీఆర్ఎంయూ) ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) కోశాధికారి సి.హెచ్.శంకరరావు అన్నారు. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో రైల్వే కార్మిక సంఘాలకు జరిగే గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన పర్యటించారు. సీఅండ్‌డబ్ల్యూ ఎస్‌ఎస్‌ఈ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో అన్ని విభాగాల్లో కలిపి ప్రస్తుతం 2 లక్షల ఖాళీలు ఉన్నాయన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య పెరగాల్సి ఉందన్నారు. ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేసే సిబ్బందికి ఎక్కువ సమస్యలున్నాయన్నారు. ట్రాక్‌పై పనిచేసే కార్మికులకు స్కిల్ వర్క్ ద్వారా గుర్తించాలన్నారు. గర్భిణులుగా ఉన్న మహిళా లోకో పైలట్లు రైలు ఎక్కి దిగే సమయంలో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వీరిని వేరే విభాగాల్లో పెట్టాలని, సేఫ్టీ రివ్యూ కమిటీ సిఫార్సుల మేరకు లోకోపైలెట్లకు ఆరు గంటలు, ఎనిమిది గంటల పనివిధానాన్ని అమలు చేయాలని కోరారు. కొన్ని విభాగాలకు రిస్క్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. యార్డ్‌లో పనిచేసే పాయింట్స్ మేన్‌కు ఉద్యోగోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. బ్రాంచ్ బాయ్స్ వ్యవస్థ పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి కేటాయించినందున రాష్ట్రంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ వెంటనే ప్రారంభించాలని కోరుతున్నామని, దీనికి దసరాలోపు శంకుస్థాపన జరిగే అవకాశం ఉందని శంకరరావు చెప్పారు. కార్యక్రమంలో హిందూ మజ్దూర్ సభ(హెచ్‌ఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఎస్.శ్రీనివాస్, ఎస్‌సీఆర్ఎంయూ విజయవాడ డివిజనల్ కార్యదర్శి ఎం.ఎల్.బి, డివిజన్ అధ్యక్షుడు రామ్‌గుప్తా, అదనపు డివిజన్ కార్యదర్శి కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

దరఖాస్తుల ఆహ్వానం

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం): కొంతమూరులోని ఈఎంఆర్ ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్, బయాలజీ, హ్యుమానిటీస్), ఎస్జీటీల సంబంధించి ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 3లోగా పాఠశాల కరస్పాండెంట్‌కు దరఖాస్తులు సమర్పించాలన్నారు. రాతపరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తామన్నారు.

అధ్యాపకుల క్రమబద్ధీకరణపై లోకేశ్‌కు వినతి

తాడేపల్లి: గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. అందరినీ మంత్రి ఆప్యాయంగా పలకరించడంతోపాటు సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్, తాత్కాలిక, అకడమిక్ కన్సల్టెంట్ విధానాల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మినిమం టైం స్కేల్ వర్తింప చేసి క్రమబద్ధీకరించాలని రాజమహేంద్రవరానికి చెందిన అడహాక్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ మంత్రి దృష్టికి ఎర్రమట్టి సమస్య

కడియం: జాతీయస్థాయిలో పేరుగాంచిన కడియం నర్సరీలు ప్రస్తుతం ఎర్రమట్టి సమస్యతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని అఖిల భారత నర్సరీ సంఘం గవర్నింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు, తెదేపా రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖామాత్యులు అనగాని సత్యప్రసాద్‌ను మంగళవారం ఉదయం కలిసి ఎర్రమట్టి ధర పెంచడంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రూ.10 వేలు ఉండే లారీ ధర ఒకేసారి రూ.15 వేలకు పెంచేశారన్నారు. ఈ పరిస్థితి చాలా దారుణమన్నారు. రైతులపై ఇది పెను భారంగా మారిందని, దీనిపై సమీక్ష జరిపి పరిష్కరించాలని కడియపులంక నర్సరీ అసోసియేషన్ తరఫున వినతిపత్రాన్ని అందించారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి బదులిచ్చారని మార్గాని తెలిపారు.



మంత్రికి రైతుల సమస్య వివరిస్తున్న మార్గాని సత్యనారాయణ

ఈఎస్ఐలో వైద్య సేవలపై ఆరా

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: నగరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని మంగళవారం భాజపా నాయకులు సందర్శించారు. భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ఇతర నాయకులు ఆసుపత్రిలోని ఆయా విభాగాలను పరిశీలించారు. ఇక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలపై సిబ్బందిని ఆరా తీశారు. రోజూ ఓపీ ఎంత ఉంటుంది? అత్యవసర కేసులెన్ని వస్తున్నాయి? ప్రస్తుతం అందుబాటులో ఉన్న పడకలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ కొత్త భవనాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపిశ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సత్యసాయి రామ్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేకంగా యువ ఓటర్ల నమోదు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లాలోని యువ ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. వెలగపూడి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం దూరదృశ్య సమావేశం ద్వారా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై సమీక్షించగా కలెక్టర్‌తోపాటు జేసీ చిన్నరాముడు, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు యువ ఓటర్ల నమోదు విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈఆర్వోలకు సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల జాబితా సవరణ తదితర అంశాలపై రాజకీయ పార్టీలతో ఈ నెల 3న ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామన్నారు. యువ ఓటర్ల నమోదుకు జిల్లాలోని నన్నయ విశ్వవిద్యాలయంతోపాటు రెండు ఇంజినీరింగ్, ఆయా డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని, నోడల్ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

4,65,383 క్లెయిమ్‌ల పరిష్కారం

జిల్లాలో ఏప్రిల్ 15 నుంచి గత నెల 30 వరకు ఫారం-6, 6ఏ, 7, 8లు కలిపి మొత్తం 4,67,855 క్లెయిమ్‌లు రాగా వీటిలో ఇప్పటివరకు 4,65,383 పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. వ్యక్తిగత దరఖాస్తులు 8,554 రాగా 4,558 పరిశీలించామన్నారు. ఇంటింటి సర్వే ద్వారా చిరునామా మారిన ఓటర్లు 1836 మంది, మరణించిన ఓటర్లు 6,187 మందిని గుర్తించామని, డెమోగ్రఫిక్ సిమిలర్ ఎంట్రీలకు సంబంధించి 7,633 గుర్తించి ఫారం-8 ద్వారా 4,929 సరిచేసినట్లు కలెక్టర్ వివరించారు.

ఇసుక రవాణా సమర్థవంతంగా నిర్వహించాలి: జేసీ

ధవళేశ్వరం: గాయత్రీ ఇసుక ర్యాంపుల్లో ఇసుక రవాణా సమర్థవంతంగా నిర్వహించాలని జేసీ చిన్నరాముడు బోట్స్ మెన్ సొసైటీ సభ్యులకు సూచించారు. మంగళవారం రవాణా ప్రక్రియను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాయత్రీ ర్యాంపుల పరిధిలో అనుమతి మేరకు ఇసుక రవాణా చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమవుతుందని అధికారులు తెలిపారు. ప్రతిరోజూ ఇసుక రవాణా సామర్థ్యాన్ని పెంచుకొనేందుకు చొరవ చూపాలని అధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా చేసినట్లు బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు జేసీకి వివరించారు. ఆర్డీవో కృష్ణ నాయక్, మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి, గోదావరి రివర్ కన్జర్వేటర్ కాశీవిశ్వేశ్వరరావు, అర్బన్ తహసీల్దారు పాపారావు తదితరులు పాల్గొన్నారు.



గాయత్రీ ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

వృద్ధురాలి పింఛను సొమ్ము చోరీ

పిఠాపురం: జగ్గయ్యచెరువుకు చెందిన గోపాలపు అనంతలక్ష్మి మంగళవారం ఉదయం పింఛనుకోసం తన మనవడిని వెంట తీసుకుని సచివాలయం-11కు వచ్చారు. కాసేపు నిరీక్షించాక పింఛను సొమ్ము అందింది. అప్పటికే ఇంటికి వెళ్లిపోయిన మనవడి కోసం ఎదురుచూస్తుండగా పరిచయం లేని ఓ వ్యక్తి వచ్చి ఇంటి వద్ద దించుతానని చెప్పి ఆమెను ద్విచక్ర వాహనం ఎక్కించుకున్నాడు. వేరే దారిలో వెళ్తుండడంతో నిలదీయగా అతను రూ.4 వేల పింఛను సొమ్ము లాక్కుని, ద్విచక్ర వాహనంపైనుంచి తోసేయడంతో ఆమె గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు దర్యాప్తు ఆరంభించారు. విషయం తెలుసుకున్న పురపాలిక కమిషనర్ కనకారావు సొంత సొమ్ము రూ.4 వేలను సచివాలయ సిబ్బందితో ఆమెకు అందించారు.

గణేష్ శోభాయాత్ర అల్లర్ల కేసులో 21 మంది అరెస్టు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : కొవ్వూరు ఒకటో వార్డు రాజీవ్ కాలనీలో వినాయక విగ్రహ శోభాయాత్ర సందర్భంగా చోటుచేసుకున్న అల్లర్లు, కొట్లాటల కేసులో 21 మంది ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వి.విశ్వం మంగళవారం తెలిపారు. వీరిలో శ్రీరామా కాలనీకి చెందిన ఆరుగురు, రాజీవ్ కాలనీకి చెందిన 15 మంది ఉన్నారన్నారు. డీఎస్పీ పర్యవేక్షణలో వీరిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని, అల్లర్లకు కారణమైన వారెవరైనా ఉంటే అరెస్టు చేస్తామన్నారు. గత నెల 20న రాజీవ్‌కాలనీ నుంచి వినాయకుడి విగ్రహం ఊరేగింపు శ్రీరామాకాలనీకి చేరుకున్న సమయంలో అల్లరి మూకలు రాళ్లు విసిరిన అల్లర్లకు దిగిన విషయం తెలిసిందే. ఆ నేపథ్యంలో మూడు రోజులపాటు అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది. రెండు కాలనీల్లో ప్రత్యేక పోలీసు బృందాలు, సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో 144 సెక్షన్ విధించారు. ప్రత్యేక బలగాల నడుమ ఊరేగింపు, నిమజ్జనం పూర్తి చేయించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు బందోబస్తు కొనసాగించాల్సి వచ్చింది. కాలనీ పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తూనే 100 మందికి నోటీసులు ఇచ్చారు. ఆ రెండు కాలనీల్లో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

రాజమహేంద్రవరం


దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం సిబ్బంది

వెంకన్న ఆలయానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన పేరిచర్ల సూర్యనారాయణరాజు రూ.1,01,000 విరాళాన్ని మంగళవారం అందజేశారు.

సినిమాలు: దానవాయిపేట: శ్యామల, అనుశ్రీ, రాజా, వీవీస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: దేవర. సూర్య మినీ, ఊర్వశి: సత్యం సుందరం, మేనక: మత్తు వదలరా–2, శివజ్యోతి: కళింగ, స్వామి: జోకర్, రంభ: 35 చిన్న కథ కాదు.

6న ఉచిత వైద్య శిబిరం

ఏవీఏ రోడ్డు: హిందూసమాజ్ శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులు రోటరీ కళావేదికలో ఈ నెల 6న వెరికోస్ వెయిన్స్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మెగావిన్ వాస్క్యులర్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరం గోడపత్రికను మంత్రి దుర్గేష్ మంగళవారం ఆవిష్కరించారు.

పింఛన్.. ఆనందం పంచెన్


26వ డివిజన్‌లో సొమ్ము అందిస్తూ..


60వ డివిజన్ పరిధిలో దివ్యాంగ బాలుడికి..


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 9వ డివిజన్ లబ్ధిదారుకు పంపిణీ


10వ డివిజన్‌లో మంచంపై కదల్లేని వృద్ధురాలికి నగదు అందిస్తూ..


35వ డివిజన్ పరిధిలో మానసిక దివ్యాంగురాలికి భరోసా

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పింఛను సొమ్మును కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తోంది. ఈ నెలా ఒకటో తేదీనే సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. సచివాలయ కార్యదర్శులు మంగళవారం ఉదయం నుంచే పంపిణీ ప్రారంభించి... కార్యాలయాలు తెరిచే సమయానికి 90 శాతానికి పైగా పూర్తిచేశారు. డివిజన్ల పరిధిలో స్థానిక నాయకులు నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సొమ్ము అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి సచివాలయ కార్యదర్శులు వెళ్లి పింఛను అందించారు.

ప్రాధాన్యత క్రమంలో హామీల అమలు


మహిళకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

టి.నగర్, న్యూస్‌టుడే: ప్రాధాన్యత క్రమంలో హామీలను అమలు చేస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 11వ డివిజన్‌లో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణ, ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం జరుగుతుందన్నారు.

విద్యార్థులు చరిత్ర చదవాలి


విద్యార్థినికి పుస్తకం అందిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి వేడుక చున్నీలాల్ జాజూ నగరపాలకసంస్థ పాఠశాలలో పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సంస్థ ఉపాధ్యక్షుడు గువ్వల వెంకటేశ్వరరావు, గౌరవ కార్యదర్శి దేవత సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు దేశానికి వెన్నెముకగా ఉండాలని, నాయకుల చరిత్రలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా వారి త్యాగం తెలుస్తుందన్నారు. సంస్థ అధ్యక్షుడు లంక సత్యనారాయణ విద్యార్థులకు దేశనాయకుల చరిత్ర పుస్తకాలు పంపిణీ చేశారు.

అమ్మ వైభవం .. 91 ఏళ్ల సంబరం

దేవీచౌక్‌లో నవరాత్రి ఉత్సవాలకు నేడు ప్రతిష్ఠాపన


శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక నగరి గోదావరి తీరంలో దసరా ఉత్సవాలది ప్రత్యేక స్థానం. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి సన్నిధిలో 91 ఏళ్లుగా అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ నిర్వహణలో భారీ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ, అమ్మవారిని నెలకొల్పేందుకు ప్రత్యేకించి వేదిక, భక్తులకు క్యూలైన్లు తదితర ఏర్పాట్లు చేశారు. దేవీచౌక్‌లో బుధవారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని మేళతాళాలతో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చి 9.09 గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన చేస్తారు. 3న గురువారం ఉదయం 8.40 గంటలకు శాస్త్రోక్తంగా కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దసరా పదిరోజులు నిత్యం ఉదయం, సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన, అఖండ హారతి నిర్వహిస్తారు. 6న 108 దంపతులతో పూజ, 9న మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతి పూజలు ఉంటాయి.


శరన్నవరాత్రి ఉత్సవాలకు దేవీచౌక్ వద్ద ఏర్పాట్లు

పూర్వీకుల నుంచి సంప్రదాయంగా..

మా పూర్వీకులు బత్తుల మునియ్య, కామరాజు వ్యాపార నిమిత్తం కోల్‌కత్తాకు వెళ్లేవారు. అక్కడ జరిగే దసరా ఉత్సవాలను తిలకించి అదే రీతిలో రాజమండ్రిలోనూ జరపాలని భావించారు. గోదావరి తీరంలో 1934లో తొలిసారిగా వారి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో ప్రస్తుత దేవీచౌక్ ప్రాంతాన్ని మూడులాంతర్ల సెంటర్ అని పిలిచేవారు. అమ్మవారి మూర్తిని ప్రతిష్ఠించి దసరా 10 రోజులు అత్యంత వేడుకగా పూజలు నిర్వహించేవారు. అదే సంప్రదాయాన్ని నేటికీ కొనసాగిస్తూ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. నాటక కళాకారులకు ప్రోత్సాహంగా తప్పనిసరిగా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం.

- బత్తుల రాజరాజేశ్వరరావు, అధ్యక్షుడు, శ్రీదేవి ఉత్సవ కమిటీ

రక్తదానం ప్రాణదానంతో సమానం



లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా ప్రకాశంనగర్‌లో నూతనంగా ప్రారంభించిన ఎన్టీఆర్ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు మద్దుల శ్రీరామ గుప్తా నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గోరంట్ల రవికిరణ్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు 36 మందిని అభినందించారు. గ్రంధి వెంకటేశ్వరరావు, వెన్నా కుమారస్వామి, లక్ష్మీవసంతకుమారి పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

వరద బాధితులకు నిత్యావసరాలు


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

దేవీచౌక్(రాజమహేంద్రవరం): విజయవాడ వరద బాధితులకు నగరానికి చెందిన ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం చేయూతనందించారు. రూ.2.50 లక్షల విలువైన నిత్యావసరాలు, వంటపాత్రలు బాధితులకు అందజేస్తున్నారు. సోమవారం విజయవాడ రాజరాజేశ్వరీనగర్‌లో సుమారు వందమందికి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఫెరీ, కొటికలపూడి గ్రామాల్లో 700 కుటుంబాలకు వంటపాత్రలు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎస్.మూర్తి తెలిపారు. సంఘం నాయకులు కిషోర్‌కుమార్, డి.పద్మశ్రీ, వి.సూర్యనారాయణ, బాపయ్య, శర్మ తదితరులు పాల్గొన్నారు.



సంఘ సభ్యులకు సత్కారం

ఏవీఏ రోడ్డు: ఎ.వి.నాగేశ్వరరావు పార్కులో గల సీనియర్ సిటిజన్స్ డే క్లబ్ భవనంలో సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో పదిమంది సంఘ సభ్యులను సత్కరించారు. సంఘ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్ మాట్లాడారు. సెప్టెంబరు నెలలో పుట్టినరోజు జరుపుకొన్న 18 మంది సంఘ సభ్యులతో కేకు కోయించారు.

రూ.1.23 లక్షల సాయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: వెంకటేశ్వరనగర్ పార్కులో జవహర్ వాకర్స్ క్లబ్ రాజమండ్రి ఆధ్వర్యంలో 75 ఏళ్లు పైబడిన వారిని సతీసమేతంగా సత్కరించారు. వరద బాధితుల సహాయార్థం క్లబ్ సభ్యుల నుంచి సేకరించిన రూ.80 వేలు, ఉషా లేడీస్ లాఫింగ్ యోగా సభ్యులు తమ సభ్యుల నుంచి సేకరించిన రూ.43 వేల విరాళం మొత్తం రూ.1,23,000ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు.



వృద్ధులు.. విరిసెను మోములు

నగరంలో మంగళవారం పలుచోట్ల ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వారికి సాయం అందించారు.. సత్కరించారు.

దుప్పట్ల పంపిణీ



రాజమహేంద్రవరం సాంస్కృతికం: తల్లిదండ్రులను ఆదరించడం ప్రతి ఒక్కరూ కనీస బాధ్యతగా తీసుకోవాలని ఇండియన్ బ్యాంక్ విశ్రాంత అధికారి ఎం.మురళీధర్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్రా వృద్ధాశ్రమ ప్రాంగణంలో వృద్ధులకు దుప్పట్లు, చేతికర్రలు పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మోదీ జీవిత విశేషాలతో ప్రదర్శన



దేవీచౌక్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భాజపా జిల్లా అధ్యక్షురాలు బొమ్ముల దత్తు ఆధ్వర్యంలో నారాయణపురం వాంబే గృహాల వద్ద మోదీ జీవిత విశేషాలతో ఫొటో ప్రదర్శన ఏర్పాటుచేశారు. భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మంగళవారం ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పకుండా మోదీ జీవిత విశేషాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు రేలంగి శ్రీదేవి, రొంగల గోపి శ్రీనివాస్, బేతిరెడ్డి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.


ఘాట్‌ను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

వాలంటీర్ల స్వచ్ఛబాట

కళాశాల కబుర్లు

దేవీచౌక్: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గోదావరి పరిసర ప్రాంతాల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పుష్కర్ ఘాట్‌లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సత్కారం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సోషల్‌వర్క్ విభాగం ఆధ్వర్యంలో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వృద్ధుల ఇబ్బందులను యువత గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను కనుగొనాలన్నారు. సోషల్‌వర్క్ విభాగాధిపతి కస్తూరి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ వృద్ధుల హక్కులను గౌరవించి అండగా నిలవాలని తెలిపారు. వారి అనుభవాలను మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వృద్ధులను సత్కరించారు.


పోటీల్లో విజేతలతో ప్రిన్సిపల్ తదితరులు

పోటీపడ్డారు.. ప్రతిభ చూపారు

రాజమహేంద్రవరం సాంస్కృతికం : స్వర్ణాంధ్రా-2047లో భాగంగా కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమ, మంగళవారాల్లో విద్యార్థులకు వ్యాసరచన, వాద ప్రతివాద, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపల్ రాఘవకుమారి బహుమతి ప్రదానం చేశారు.

మహాత్ముడి కల..

అయిదు గ్రామాలను దత్తత తీసుకుని..


కాతేరులో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు

దేవీచౌక్: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం కోసం పాటు పడుతున్నారు. కళాశాలలో మొత్తం అయిదు యూనిట్లు ఉండగా ఒక్కో యూనిట్ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. కాతేరు, కోలమూరు, హుకుంపేట, పిడింగొయ్యి, గాడాల గ్రామాలను విద్యార్థులు దత్తత తీసుకున్నారు. స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, పశువైద్య శిబిరాలు, ప్లాస్టిక్ వాడకంపై అవగాహన సదస్సులు, రహదారి భద్రతపై ర్యాలీ వంటి కార్యక్రమాలు ఆ గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. వీటిలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులే స్వయంగా గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ భవానీ వెల్లడించారు.

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి, స్వచ్ఛ పరిసరాలకు సామాజిక బాధ్యతతో ముందుకెళ్తున్నారు ఈ విద్యార్థుల బృందాలు. దేశానికి పల్లెలే పట్టుగొమ్మలన్న మహాత్ముని మాటల స్ఫూర్తితో వాటి బాగుకు ఏటా తమవంతు ప్రయత్నం చేస్తున్నది ఒకరు.. తాము నిత్యం తిరుగాడే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛబాటన నడుస్తున్నది మరొకరు. నేడు గాంధీ జయంతి సందర్భంగా వీరి ప్రయత్నంపై 'న్యూస్‌టుడే' కథనమిది.

సాకారం ఇలా..


రాజ్యలక్ష్మి ప్రమదావనం వద్ద విద్యార్థినుల స్వచ్ఛభారత్

విద్యార్థినులు తీర్చిదిద్దిన వనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం : సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు స్త్రీ విద్యకు ఎనలేని ప్రోత్సాహం అందించారు. రాజమహేంద్రవరం దానవాయిపేటలో ఆయన భార్య రాజ్యలక్ష్మి పేరుతో నిర్వహిస్తున్న కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలకు విశాలమైన ఆవరణలో ఉంటుంది. కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు క్రమం తప్పకుండా వారంలో ఒకరోజు స్వచ్ఛభారత్ నిర్వహించి శుభ్రం చేస్తారు. ప్రత్యేకించి కళాశాల మధ్యలో రాజ్యలక్ష్మి ప్రమదావనం పేరుతో పూలమొక్కలు, అందాన్నిచ్చే మొక్కలను పెంచుతున్నారు. మహాత్ముడి ఆశయాలకు అనుగుణంగా తమ కళాశాలను పరిశుభ్రంగా ఉంచడంలో విద్యార్థినులు కృషి చేస్తున్నారు.


విజేతలతో జనవిజ్ఞాన వేదిక నాయకులు

విజ్ఞాన వెలుగులు

శ్యామలా సెంటర్: జన విజ్ఞాన వేదిక మండలస్థాయి పోటీలు నగరంలోని గౌతమీ పాఠశాలలో మంగళవారం జరిగాయి. వేదిక జిల్లా కన్వీనర్ ఎన్.రవిబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచినవారికి ఈనెల 27న జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలను పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ తదితరులు అందించారు.

విజేతలు వీరే..

ప్రభుత్వ పాఠశాలల విభాగం: కంటిపూడి రామారావు మున్సిపల్ పాఠశాల(ప్రథమ), లాలాచెరువు మున్సిపల్ పాఠశాల(ద్వితీయ), ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల(తృతీయ), చున్నీలాల్‌జాజూ మున్సిపల్ స్కూలు ప్రోత్సాహక బహుమతి అందుకుంది.

ప్రైవేటు పాఠశాలల విభాగం: గాంధీపురం శ్రీగౌతమి(ప్రథమ), శ్రీరాంనగర్ శ్రీగౌతమి స్కూలు(ద్వితీయ), ప్రగతి పాఠశాల(తృతీయ).

డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేపట్టాలి

వి.ఎల్.పురం: పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీ ఎంపీ భరత్‌రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం వి.ఎల్.పురంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత దుస్థితికి చంద్రబాబునాయుడే కారణమని ఆరోపించారు. తితిదే ప్రతిష్ఠను కూటమి ప్రభుత్వం దెబ్బతీయాలని చూస్తోందన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

దేవీచౌక్: వీఎల్ పురం వినాయకుడి ఆలయం వద్ద భాజపా నాయకులు సభ్యత్వాల నమోదుకు మంగళవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధానిగా మోదీ పాలను చూసి అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వాలు నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. నాయకులు క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, యెనుముల రంగబాబు, చింతపల్లి సతీష్, లలిత్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల బైక్ ర్యాలీ

దేవీచౌక్, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ ఉద్యోగులు, అధికారులు మంగళవారం రాజమహేంద్రవరంలో ప్లకార్డులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన జిల్లా ప్రిన్సిపల్ జీఎం రాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో బీఎస్ఎన్ఎల్ సేవలకు ప్రజల్లో ఆదరణ బాగా పెరిగిందన్నారు. సంస్థ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. డీజీఎంలు రాజశేఖర్ బాబు, సత్యనారాయణ, నాగరాజు, ఏజీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో ఢీకొని గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: స్వరాజ్‌నగర్ ప్రాంతానికి చెందిన పి.తాతాలు సోమవారం రాత్రి ఆల్కట్‌గార్డెన్ గోదావరి గట్టుపై వెళ్తుండగా ఆటో ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

వాహనం అదుపుతప్పి..

వీవర్ కాలనీకి చెందిన నవీన్‌దొర ద్విచక్ర వాహనంపై మంగళవారం కోరుకొండ రోడ్డులో వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు విభాగిని ఢీకొన్నారు. తీవ్ర గాయం కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఏడాదైంది.. ఇంకెప్పుడో పరిష్కారం

కాలనీ సమస్య

న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఇన్నీసుపేట వీటీ కళాశాల.. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం స్థాపించిన విద్యాలయం. ఘన చరిత్ర కలిగిన విద్యాలయం నేడు అవస్థల నడుమ నడుస్తోంది. ప్రమాదకరంగా మారిన కళాశాల ప్రహరీని ఏడాది క్రితం కూల్చినా నేటికీ పునః నిర్మించకపోవడంతో ఇటు విద్యార్థుల రక్షణ.. అటు సమీప ప్రాంతంలో కాలనీవాసులకు ఇబ్బంది ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి స్థానికులు సమస్యను విన్నవించడంతో పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన హామీఇచ్చారు.

వీటీ కళాశాల ప్రహరీ పూర్తిగా దెబ్బతినడంతో గత ఏడాది ఆగస్టు 17న కూల్చివేశారు. ఇప్పటికీ పునః నిర్మించలేదు. ఇది సమీప కృష్ణారావుపేట వాసులకు అవస్థగా మారింది. కళాశాల ప్రాంగణంలో గుబురుగా పెరిగిన మొక్కలతో విష కీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయి. మరోవైపు సమీప రైల్వే స్థలాన్ని ఆకతాయిలు మద్యం తాగడానికి అడ్డాగా మార్చుకున్నారు. ఆ మత్తులో వీధుల్లోకి వచ్చి నివాసితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మంగళవారం 27వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రాగా.. స్థానికులు తమ ఇబ్బందులు ఏకరవు పెట్టారు. వారి ఆవేదన విన్న ఎమ్మెల్యే ప్రహరీ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని మున్సిపల్ ఏఈ మంజులను ఆదేశించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను తక్షణం తొలగించాలన్నారు. ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రెండో పట్టణ సీఐ దుర్గారావుకు సూచించారు.


అధికారులతో మాట్లాడుతున్న గోరంట్ల


కళాశాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు

ఆకతాయిలతో ఇబ్బంది

కొందరు ఆకతాయిలు రైల్వే స్థలంలో మూడు అడుగుల ఎత్తు ఉన్న గోడ దాటి కళాశాల ప్రాంగణంలోకి వస్తున్నారు. ఇక్కడ ప్రహరీ లేక మా వీధిలోకి తరచుగా వస్తున్నారు. ఇటీవల రాత్రి ఒంటిగంట సమయంలో మద్యం మత్తులో ఉన్న కొందరు వీధిలోకి వచ్చి ద్విచక్ర వాహనం చోరీ చేసేందుకు ప్రయత్నించారు. ప్రహరీ ఉంటే ఈ పరిస్థితి ఉండదు.

- నారాయణ

పాముల భయం

కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగిపోవడంతో మా వీధిలోకి తరచూ పాములు వస్తున్నాయి. పిల్లలతో చాలా భయంగా ఉంటున్నాం. పాములు వచ్చిన ప్రతిసారీ వాటిని పట్టించడానికి రూ.వెయ్యి నుంచి రూ.1,500 ఖర్చవుతోంది. త్వరితగతిన ప్రహరీ నిర్మించాలి.

- లక్ష్మణరావు

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

విద్యుత్తు స్తంభం సరిచేశారు

ఈనాడు కథనానికి స్పందన

రంగంపేట: రంగంపేట-వడిశలేరు మధ్య ఏడీబీ రోడ్డు పక్కన రంగంపేట నల్లచెరువు గట్టుపై చెరువులోకి ఒరిగిపోయిన విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారడంపై 'ఈనాడు'లో 'ఒరిగిన స్తంభం. . పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. యంత్రాల సాయంతో నిలబెట్టడంతో పాటు, సమస్య పునరావృతం కాకుండా ఆధార తీగను ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 8వ తరగతి విద్యార్థి


బి.అభిలాష్

సీతానగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో కబడ్డీ విభాగం అండర్-14లో సీతానగరం మండలం వంగలపూడి కల్లూరి రామకృష్ణ పరమహంస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి బేదంపూడి అభిలాష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని జె.ఉషా సునీత తెలిపారు. ఈ నెలలో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతాడని వ్యాయామ ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

చెత్త తొలగింది

శౌటిలైట్‌సిటీ సచివాలయం వీధిలో గత కొంతకాలంగా చెత్త, కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల మురుగు పారడం లేదు. ఈ సమస్యపై 'ఈనాడు'లో చెత్తతో దుర్వాసన అంటూ మంగళవారం వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందించిన సిబ్బంది చెత్త, కాలువలో పూడికలు తొలగించారు.

దుర్వాసన భరించలేం

సమస్య: బొమ్మూరు నుంచి రాజవోలు వెళ్లే మార్గంలో మలుపు వద్ద చెత్త రోడ్డుపై వేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - విశ్వపతి, బొమ్మూరు

సమాధానం: ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా హెచ్చరికబోర్డు ఏర్పాటు చేస్తాం. ఇప్పటి వరకు వేసిన వ్యర్థాలను తొలగిస్తాం.

- న్యూస్‌టుడే, బొమ్మూరు — శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి, బొమ్మూరు

తాగునీరు వృథా

సమస్య: హుకుంపేట పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డినగర్ మూడుగుళ్ల వీధిలో సచివాలయం సమీపాన పైపులైను పగిలి నీరు వృథాగా పోతోంది. పైపుల నుంచి నీరు సక్రమంగా రావడం లేదు. చర్యలు తీసుకోండి. - పి.సుజాత, స్థానికురాలు

సమాధానం: సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. పైపులైన్లకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. - వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి, హుకుంపేట

- న్యూస్‌టుడే, హుకుంపేట

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

పేరులోనే ధవళం.. శుభ్రతకు మంగళం..!

మొక్కుబడిగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధవళేశ్వరం మేజర్ పంచాయతీలో ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలు, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారి సహా కాలనీలు చెత్తమయంగా మారుతున్నాయి. కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగు పారడంలేదు. మొక్కుబడిగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం మారిందన్నది క్షేత్రస్థాయిలో అర్థమవుతోంది.

● లక్ష్యం గాలికి..: గ్రామాలను స్వచ్ఛంగా మార్చాలనే సంకల్పంతో ప్రభుత్వం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే ధవళేశ్వరంలో మాత్రం ఆ ఛాయలు కనిపించడం లేదు. 20 మేర చెత్త సేకరించే రిక్షాలు తుప్పు పట్టి మూలకు చేరడం, సేకరణపై దృష్టి పెట్టకపోవడం.. వెరసి ఇబ్బందికరంగా మారింది. 60 వేలకు పైగా జనాభా ఉన్న ఇక్కడ 7 ట్రాక్టర్లు, 25 రిక్షాలు, 93 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నా.. నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యమే కనిపిస్తోంది. కాటన్‌పేట, ఎర్రకొండ, లక్ష్మీజనార్దనస్వామి కాలనీ.. ఇలా అనేక చోట్ల ఈ సమస్య కళ్లకు కడుతోంది.


తుప్పుపట్టి మూలకు చేరిన రిక్షాలు

కొలిక్కి రాని డంపింగ్‌యార్డు సమస్య

డంపింగ్ యార్డు స్థల వివాదం కారణంగా అందుబాటులోకి రాలేదు. దాంతో బొమ్మూరు డంపింగ్ యార్డుకే ఇక్కడి చెత్త, వ్యర్థాలను తరలించేవారు. గతంలో అగ్నిప్రమాదం జరగడం, స్థానికుల ఆందోళనల నేపథ్యంలో అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ యార్డులోకి వ్యర్థాల తరలింపు నిలిపివేశారు. సేకరించిన చెత్తను జాతీయ రహదారి చెంత, ప్రైవేటు స్థలాలు, తూర్పుడెల్టా కాలువ గట్టుమీద వేసి నిప్పు పెడుతున్నారు. డంపింగ్ యార్డు అందుబాటులోకి వస్తే తప్ప పరిష్కారం లభించని దుస్థితి.


ఉడతావారి వీధిలో రహదారిపై వ్యర్థాలు

చెత్తను తొలగిస్తాం..

వీధుల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. చెత్తకుండీలు ఏర్పాటు చేసినా ప్రజలు వాటిలో వేయకుండా కింద పడేస్తున్నారు. దాంతో సమస్య వస్తోంది. ప్రజలు కూడా సహకారం అందించాలి.

డి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

మహిళా క్రికెట్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


వర్షిణిని అభినందిస్తున్న నితిన్‌రాజ్

దివాన్‌చెరువు (రాజానగరం), న్యూస్‌టుడే: కాకినాడ పీఆర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 మహిళా క్రికెట్ ఎంపికలో దివాన్‌చెరువులోని ఓక్‌వుడ్ పాఠశాల విద్యార్థిని గంగిశెట్టి వర్షిణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల డైరెక్టర్ డా.కె.నితిన్‌రాజ్ తెలిపారు. వర్షిణిని ఆయనతో పాటు హెచ్‌ఎం ఎ.రాజేంద్రనాథ్, పి.నగేష్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

అనపర్తి గ్రామీణం: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కర్రి కళ్యాణి, పీఈటీ రాజేశ్వరి మంగళవారం తెలిపారు.

బిక్కవోలు: పందలపాక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు యువరాజారెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

గోకవరం: గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని మల్లవరం పంచాయతీ పరిధిలోని కలిజోల్లపేట వాసులు డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో మంగళవారం మల్లవరం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతులు అందించారు.

రేంజర్ కరుణాకర్ దంపతులకు సన్మానం

గోకవరం: అటవీ శాఖ ఫోక్సుపేట రేంజ్ అధికారి కరుణాకర్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని కూనవరం రేంజ్ అధికారిగా బదిలీ అయిన నేపథ్యంలో సూదికొండ గ్రామంలోని రేంజ్ కార్యాలయంలో మంగళవారం వీడ్కోలు పలికారు. అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అడవుల సంరక్షణలో సిబ్బంది పాత్ర కీలకమన్నారు.

వీజేస్ ఫార్మసీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ


చెత్తను ఊడ్చిన వాలంటీర్లు

దివాన్‌చెరువు (రాజానగరం): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ దివాన్‌చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో నినదించారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.డి.నరేంద్ర మాట్లాడుతూ.. పరిశుభ్రతపై దృష్టి సారిద్దాం.. ప్లాస్టిక్ రహిత సమాజం దిశగా అడుగేద్దామని పిలుపునిచ్చారు. కళాశాల కరస్పాండెంట్ ఎనిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ డా.బి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్‌కు రూ.లక్ష విరాళం


రఘువీరానందజీకి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


అనపర్తి గ్రామీణం: గిరిజనులకు, పేదలకు వైద్యసేవలు అందిస్తున్న రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్‌కు అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి రూ.1లక్ష విరాళమందించింది. అనపర్తి వివేకానంద సెంటర్ వద్ద రామకృష్ణ మిషన్ చారిటబుల్ డిస్పెన్సరీ డైరెక్టర్ స్వామి రఘువీరానందజీకి మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెక్కు అందజేశారు. సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందరరామరెడ్డి, కార్యదర్శి నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ● రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని మంగళవారం ఏపీఎస్ఎస్‌పీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

హామీలు నెరవేరుస్తున్నాం: గోరంట్ల


పింఛను సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కోటగుమ్మం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం 27వ డివిజన్ రామాలయం వీధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక సమస్యలున్నా పేదల సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామన్నారు. డివిజన్ పర్యటనలో భాగంగా కోటిపల్లి బస్టాండ్ వద్ద గల ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

గోదావరి నదిలో పడవపై 'భరోసా'


ములకల్లంకలో ఉదయం 5 గంటలకే పింఛన్ల పంపిణీ

సీతానగరం: గోదావరి నదిమధ్యలో ఉండే సీతానగరం మండలం ములకల్లంక గ్రామానికి చేరాలంటే పడవలపైనే రాకపోకలు చేయాలి. తెల్లవారుజామునే రైతులు, కూలీలు లంకకు వివిధ పనులకు, పొలాల పనులకు ప్రతిరోజు పడవలపైనే బయలుదేరి వస్తున్నారు. రాత్రి పొద్దుపోయాక కానీ లంకకు చేరరు. దీంతో సామాజిక భద్రత ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సులభతరం పూర్తిచేయడానికి సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు గోదావరి ఒడ్డుకు చేరి పంపిణీ చేస్తున్నారు.

మొదటి రోజు 97 శాతం పంపిణీ..

బొమ్మూరు: రాజమహేంద్రవరం గ్రామీణంలో 19,730 పింఛనుదారులకు గాను 19,422 మందికి మంగళవారం అందజేశామని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. 97 శాతం పూర్తి చేశామన్నారు. మొదటి రోజు రూ.8.30 కోట్లు అందజేసినట్లు చెప్పారు.

రంగంపేట: ఉదయం 6గంటలకే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జి.దొంతమూరు చేరుకొని పింఛన్ల పంపిణీ ప్రారంభించి ఎంపీడీవోలతో చర్చించారు. 98.27శాతం పంపిణీ పూర్తి చేసుకుని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.వెంకటరత్నం తెలిపారు.

బిక్కవోలు: బలభద్రపురంలోనూ ఎమ్మెల్యే నల్లమిల్లి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం కదిలిన చిన్నారులు


చెక్కుతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు

రంగంపేట: విజయవాడ వరద బాధితులకు సాయం అందించేందుకు రంగంపేట వుండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేయిచేయి కలిపారు. మంగళవారం వీరు సేకరించిన రూ.16600లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.పార్థసారధికి అందించగా ఆయన 'ఈనాడు' సహాయనిధి ఖాతాకు పంపించారు.

'చేపల చెరువులు దక్కకుండా కుట్ర'

ఏవీఏ రోడ్డు: రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం నిడిగట్ల గల ఎస్సీ ఫిషర్‌మ్యాన్ సొసైటీ చెరువులో జనసైనికులు కొందరు చేపల కోసం కుట్రకు తెరతీశారని స్వతంత్ర జనతా పార్టీ(పబ్లిక్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బర్రె ఆనంద్ కుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఫిషర్‌మ్యాన్ సొసైటీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. 50 ఏళ్ల క్రితం నాటి మంత్రి బత్తిన సుబ్బారావు జిల్లాలో అనేక గ్రామాల్లో ఫిషర్‌మ్యాన్ సొసైటీలను రిజిస్టర్ చేయించి, వారికి చెరువులను అప్పగించారన్నారు. ప్రభుత్వానికి లీజులు చెల్లిస్తూ ఈ చెరువులను ఉమ్మడి ఆస్తిగా భావించి ఎస్సీలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ చెరువులను ఎస్సీలకు లేకుండా చేయాలని కుట్రతో గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గం నాయకులు(జన సైనికులు) వందల సంఖ్యలో చేపలను దొంగతనం చేయించారన్నారు. దొంగలను పట్టుకున్నా విడిపించుకుపోవడంతో పాటు కుల దూషణకు పాల్పడుతూ బెదిరించారన్నారు. ఈ విషయంపై కోరుకొండ పోలీసు స్టేషన్, ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. తర్వాత మరింత కక్ష సాధింపు ధోరణితో సదరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మరోవైపు ఫిషర్‌మ్యాన్ సొసైటీ అధ్యక్షుని సొసైటీ సభ్యులకు తిరిగి నోటీసులు పంపుతూ వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో బాధితులకు అండగా పార్టీ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. సమావేశంలో ఎస్సీ ఫిషర్ మ్యాన్ సొసైటీ ప్రెసిడెంట్ గొంతి లక్ష్మణ్, అబ్బులు, శ్రీను, రాజేష్, జార్జి బెన్ని తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే


సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాష్‌బాబు

ధవళేశ్వరం: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను మర్యాదపూర్వకంగా చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలదే అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వృద్ధుల పరిరక్షణపై సంబంధిత శాఖ అధికారులు, ఎన్జీవో సంస్థలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు కనీస అవసరాలను సమకూర్చకపోయినా, వారి పట్ల అగౌరవంగా ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తీసుకొనే హక్కు వృద్ధులకు ఉందన్నారు. దీనిపై జిల్లా న్యాయ సేవాసంస్థలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. వృద్ధులకు న్యాయ సేవల పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ శాఖల అధికారులు, వయోవృద్ధులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వినూత్న పరిశోధనలు అవసరం

రాజానగరం: భావి తరాలకు మెరుగైన సమాజాన్ని అందించేందుకు వినూత్న పరిశోధనలు చేయాలని గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ (జీజీయు) ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. జీజీయులో మంగళవారం నిర్వహించిన మొదటి బ్యాచ్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విజ్ఞానాన్ని మేధస్సుతో కలిపి సమాజానికి అందించాలన్నారు. కార్యదీక్ష, నైపుణ్యంతో ప్రపంచంలో దేన్నైనా సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరిలో పోటీతత్వం ఉండాలన్నారు. జీజీయు ఉపకులపతి డా.యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ యువ ఇంజనీర్లు చేసే పరిశోధనల ఫలితాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. డా.ఎస్ఎస్ఎన్ రాజు, డా.పి.ఎం.ఎం.ఎస్ శర్మ, డా.ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి విజేతలు వీరే


కడియంలో విజేతలతో ఉపాధ్యాయులు

కడియం, న్యూస్‌టుడే: కాలానుగుణంగా చదువుతో పాటు విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ సూచించారు. కడియం జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల, జిల్లా స్థాయి చెకుముకి పోటీలు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో వేమగిరి, దుళ్ల, కడియం పాఠశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. ప్రైవేటు విభాగంలో స్థానిక శ్రీషిర్డీసాయి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. వీరంతా ఈ నెల 27న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని జేవీవీ కార్యదర్శి వై.నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, సువర్ణవేణి, శాస్త్రీ, నాగమణి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

27న జిల్లాస్థాయి పోటీలు

సీతానగరం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సీతానగరంలోని పువ్వాడ సత్యమాంబ స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. 7 ప్రభుత్వ పాఠశాలలు, ఐదు ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలంతా ఈ పోటీల్లో పాల్గొన్నారు. రఘుదేవపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, హర్షవర్ధన్‌కు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 27న రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలు ఉంటాయని జేవీవీ కన్వీనర్ కన్నూరి సతీష్‌బాబు తెలిపారు.

బిక్కవోలు: బలభద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పరీక్షలకు ఎంఈవో పూర్ణచంద్రరావు హాజరై ప్రసంగించారు.

వెలుగు సిబ్బందిపై చర్యలు శూన్యం

కడియం, న్యూస్‌టుడే: కడియం మండలంలో డ్వాక్రా నిధులు దారి మళ్లించిన సిబ్బందిపై వెలుగు అధికారుల చర్యలు శూన్యమని కడియపులంక ఇన్‌ఛార్జి సర్పంచి పాటంశెట్టి రాంజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు బాధిత డ్వాక్రా బృంద సభ్యులతో కలిసి ఆయన మంగళవారం ఉదయం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కడియపు లంకలో దాదాపు 30 డ్వాక్రా బృందాలకు సంబంధించిన నగదు గోల్‌మాల్ జరిగిందన్నారు. పక్కదారి పట్టిన రూ.లక్షల నగదు లెక్కతేల్చాలని, బాధిత మహిళలతో కలిసి ఇటీవల రాజమహేంద్రవరంలోని ఆ శాఖ పీడీకి వినతిపత్రాన్ని అందించామన్నారు. ఇప్పటి వరకూ చర్యలు లేవని, అక్రమాల నిగ్గుతేల్చేందుకు విచారణ జరగలేదన్నారు. ఈ వివాదాన్ని సకాలంలో పరిష్కరించాలని, లేకుంటే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కోరుతామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

హుకుంపేట: చిన్నారుల్లో రక్తహీనత, అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని హుకుంపేట సరస్వతి ఇంగ్లీషు మీడియం పాఠశాల ఛైర్‌పర్సన్ పశుమర్తి ముకుందప్రియ అన్నారు. మంగళవారం హుకుంపేటలోని పాఠశాలలో ఎబిసి పిల్లల ఆసుపత్రి వైద్యులు కె.వి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 300 మంది విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వాసురెడ్డి, ఏవో మౌలాలి, బాబ్జి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


శివరామకృష్ణను అభినందిస్తున్న వాసురెడ్డి

ప్రకటన

నా క్లయింటు కోండ్రపు రమణమ్మ, W/o. వెంకట్రావు, సీతానగరం, వెలంపేట, సీతానగరం మండలం, తూర్పుగోదావరి జిల్లా వారి సంజాయిషీపై యావన్మందికి తెలియచేయునది ఏమనగా,

నా క్లయింటు దిగువ షెడ్యూలు పూర్వార్జితపు ఆస్తి విభజన చేసి తన వాటా కొరకు పైలా ముత్యాలమ్మ, శిరికి మంగతాయారు, కిర్ల పద్మావతి, గుల్లిపల్లి ప్రమీల, కొయ్యాన ప్రభావతి, పైలా కన్నయ్యలను ప్రతివాదులుగా O.S. No. 613/2024 గా రాజమహేంద్రవరం, మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు వాదిగా దావా వేసియున్నారు. సదరు పార్టిషన్ దావా విషయమును మధ్యపర్తి 1 నుండి 5వ ప్రతివాదులు దురుద్దేశ్య పూర్వకంగా షెడ్యూలు ఆస్తిని అన్యాక్రాంతం చేయుటకు తప్పుడు పత్రములు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయుటకు ప్రయత్నించుచున్నట్లుగా నా క్లయింటుకు రూఢిగా తెలియవచ్చినది.

యిందుమూలముగా తెలియచేయునది ఏమనగా, నా క్లయింటుకు షెడ్యూలు ఆస్తి నందు హక్కు కల్గి, పైలా అప్పారావు గారి దత్తుడు అగు పైలా కన్నయ్య యొక్క స్వాధీన హక్కుభుక్తములు కల్గియున్న షెడ్యూలు ఆస్తి నిమిత్తమై ఎవరు ఎటువంటి లావాదేవీలు చేసిననూ అవి చెల్లవని, నా క్లయింటుకు గల హక్కును బంగపరచవని, మరియు అట్లు చేసిన వారు నష్టపోవుదురు అని, మరియు నా క్లయింటు చట్టరీత్యా తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురని యిందుమూలముగా హెచ్చరించటమైనది.

షెడ్యూలు

East Godavari District, Sithanagaram Mandal and Sub-Registry, Raghudevapuram Gram Panchayath, Raghudevapuram Village, Land in R.S. No. 12/2A in a total extent of Ac. 1-10 cts bounded by:

EAST: Road. **SOUTH:** Land belongs to Pulleti Prakasam. **WEST:** Land belongs to Varri Atchiyamma. **NORTH:** Property belongs to Koyyanna Prabavathi.

Bore with Motor, easementary rights, path ways, water sources and standing crop etc.,

బొబ్బిలి బాంధవి, అడ్వకేట్
డో.నెం.17-11-13, సీతంపేట
రాజమండ్రి
రాజమండ్రి
01-10-2024 సెల్: 7702461364

వరిలో సమగ్ర సస్యరక్షణ పాటించాలి




అనపర్తి గ్రామీణంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

అనపర్తి గ్రామీణం: యాజమాన్య పద్ధతులు పాటించి వరిలో ఎండు తెగులు నివారించుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహం, ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ సూచించారు. మహేంద్రవాడ, పొలమూరు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

కానవరం (రాజానగరం): వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని.. తద్వారా ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పిలుపునిచ్చారు. మండలంలోని కానవరంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

రంగంపేట: రంగంపేట మండలం వెంకటాపురం, కోటపాడులలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది.

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది.





వృద్ధుడి అదృశ్యం

రాజమహేంద్రవరం నేరవార్తలు: బొమ్మూరు నేతాజీనగర్‌కు చెందిన ఏలూరి రమణరావు(68) గత నెల 23 నుంచి కనిపించడం లేదని అతడి మనవడు వి.సీతారామ్ మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

20 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం నేరవార్తలు: కవలగొయ్యి ప్రాంతానికి చెందిన పీవీ జానకిరామ్ తన ఇంటి వద్ద సారా విక్రయిస్తుండగా బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కడియంలో అగ్ని ప్రమాదం

రూ.10 లక్షల ఆస్తి నష్టం

కడియం, న్యూస్‌టుడే: కడియం పోలీసుస్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన కోమటి ప్రభాకరరావు, భాస్కరరావు నివాసముంటున్న రెండు తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో ఇళ్లల్లోని సామగ్రి కాలి బూడిదైంది. ప్రాణనష్టం జరగకపోయినా ఆస్తినష్టం విలువ రూ.10లక్షలు ఉంటుందని బాధితులు గ్రామ రెవెన్యూ అధికారులకు వివరించారు. ఘటనాస్థలికి ఉపసర్పంచి వెలుగుబంటి రఘురామ్ చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున సాయమందిస్తామన్నారు. వీఆర్వో ప్రశంసతో కలిసి బాధితులకు బియ్యాన్ని అందించారు. ప్రమాద కారణాలు తెలియాల్సి ఉంది.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అవకతవకలపై విచారణ చేయాలి

నందరాడ (రాజానగరం), న్యూస్‌టుడే: నందరాడ సొసైటీలో అవకతవకలపై ప్రత్యేకాధికారితో విచారణ జరిపించాలని భాజపా అసెంబ్లీ కో కన్వీనర్ అడబాల గణపతిరావు, మండల శాఖ అధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు డిమాండ్ చేశారు. సొసైటీలో తాము తీసుకున్న రుణాలకు వడ్డీ కట్టినప్పటికీ, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతుల రుణాలు రెన్యువల్ చేయలేదని ఆరోపించారు. ఆ వివరాలు రైతులకు తెలియజేయకపోవడం, అసలు ఎంత ఓవర్ డ్యూ ఉందో కూడా సకాలంలో తెలుపకపోవడం వంటి చర్యల కారణంగా రైతులపై ఆర్థిక భారం పడిందన్నారు. సొసైటీలో ఆర్థిక అవకతవకలు యదేచ్ఛగా జరిగినట్లు తమ వద్ద సమాచారం ఉందని, విచారణ జరిపిస్తే అవన్నీ బయటకు వస్తాయన్నారు. పంట రుణాలు తిరిగి చెల్లించిన రైతులకు ఏడు శాతం వడ్డీతో వెంటనే రెన్యువల్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సొసైటీలో 2,500 మంది రైతులు సభ్యులుగా ఉన్నప్పటికీ ఇటీవల నిర్వహించిన మహాజనసభకు కేవలం 20 మందికి మించి సభ్యులు హాజరుకాలేదని, కోరం లేకపోవడంతో సభను వాయిదా వేసుకోవాల్సి వచ్చిందన్నారు. చిట్టిప్రోలు సత్తిబాబు, కోలా సత్యనారాయణ, కూరాకుల ధర్మరాజు, ప్రసన్నాంజనేయ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

30 మంది రక్తదానం


శిబిరంలో రక్తదానం చేస్తున్న మహిళ

నల్లజర్ల: లయన్స్‌క్లబ్ (దూబచర్ల), పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ (నల్లజర్ల) ఆధ్వర్యంలో దూబచర్లలోని ఎలైట్ డిగ్రీ కళాశాలలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ప్రభుత్వాసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 30 మంది రక్తదానం చేసినట్టు శిబిరం నిర్వాహకుడు అంబటి శ్రీనివాసరావు తెలిపారు. కెల్లా శ్రీనివాస్, శ్రీలక్ష్మి, తాతిన సత్యనారాయణ, మహ్మద్ ఇలియాస్ షరీఫ్ పాల్గొన్నారు.

నిర్మాణాత్మక సమాజానికి పునాదులు


వయోవృద్ధులను సన్మానిస్తున్న కొవ్వూరు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కొవ్వూరు పట్టణం, నిడదవోలు: వయోవృద్ధుల మార్గదర్శకాలు మంచి సమాజానికి తోడ్పడతాయని కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ఇస్రో పూర్వ శాస్త్రవేత్త రెడ్డి తాతయ్యబాబు, విశ్రాంత బ్యాంకు మేనేజరు పులప సత్యనారాయణ, సాయిసేవాదళ్ సభ్యులు కె.హనుమంతరావు, విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు కె.లక్ష్మీపతి రాజులను సత్కరించారు. నిర్మాణాత్మక సమాజానికి పునాదులైన వృద్ధులను గౌరవించడం సంప్రదాయమని సత్యనారాయణ అన్నారు. క్లబ్ కోశాధికారి నాళం శ్రీనివాసరావు, సభ్యులు చినబాబు, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, బుల్లిబాబు, రామకిషోర్ పాల్గొన్నారు. ● వయోవృద్ధులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు న్యాయస్థానాలు పని చేస్తున్నాయని ప్యానెల్ న్యాయవాది పీవీపీ లక్ష్మి అన్నారు. కొవ్వూరు వాత్సల్య వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ● వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి నివేదించేందుకు ఒక వేదిక అవసరమని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ మహిళా అధ్యక్షురాలు కొండా నిర్మల, జిల్లా అధ్యక్షుడు కె.మదన్మోహన్ రెడ్డి అన్నారు. నిడదవోలులో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో బీసీ కమ్యూనిటీ హాల్‌లో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. 80 ఏళ్లు పైబడిన వయో వృద్ధులైన 21 మంది సభ్యులను సత్కరించారు. 110 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. సంఘ అధ్యక్షుడు అడపా సూర్యచంద్రరావు, కార్యదర్శి ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, కీర్తి ఆంజనేయులు, దారపురెడ్డి సూర్యచంద్రరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, ముంగండ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక తక్షణమే అందించాలి



నిరసనలో భవన నిర్మాణ కార్మికులు

నిడదవోలు, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు ఈమని గ్రీష్మకుమార్ డిమాండ్ చేశారు. నిడదవోలు మండలం పెండ్యాలలో ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశాన్ని మంగళవారం సంఘ అధ్యక్షుడు వాకా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. కారింకి రమేష్, వాకా రాంబాబు, వెంకటేశ్వరరావు, మిద్దె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా ఆధ్వర్యంలో రూ. 3.21 లక్షల విరాళం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల కోసం చేసే దాతృత్వం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు జోన్ 'అపుస్మా' ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.3.21 లక్షల విరాళం చెక్కును మంగళవారం అందించారు. కొవ్వూరు తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడం ప్రశంసనీయమన్నారు. అపుస్మా కొవ్వూరు జోన్ అధ్యక్షుడు అనీష్, కార్యదర్శి పి.వెంకటరత్నం, కోశాధికారి తిమోతి, జిల్లా కార్యదర్శి పేరిచర్ల రామకృష్ణంరాజు, జోన్ పరిధిలోని 31 పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు, కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుకు చెక్కు అందిస్తున్న ప్రతినిధులు

కొవ్వూరు
•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

గంగాలమ్మ గ్రామోత్సవం



ఊరేగింపులో పడవ ఆకారంతో భక్తులు

తాళ్లపూడి: ప్రక్కిలంకలో గంగాలమ్మతల్లి గ్రామోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గోదావరి నదిపై జీవించే వీరు అందరూ పడవ ఆకారాన్ని తీర్చిదిద్ది మోసుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో వీధుల గరగనృత్యాలు, డప్పువాయిద్యాలతో బాణసంచా పేల్చుతూ ఉత్సవం సాగించారు. అనంతరం పడవ ఆకారాన్ని గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు తహసీల్దారు కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై వివిధ రాజకీయ పక్షాల నాయకులతో మంగళవారం సమావేశం జరిగింది. తహసీల్దార్ నాగరాజు నాయక్ వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. సమావేశంలో తెదేపా నాయకుడు తిరుపతి సత్యనారాయణ, కరీం, సీపీఎం నుంచి జువ్వల రాంబాబు, భాజపా నుంచి నీలం రామారావు పాల్గొన్నారు.

పొదలు తొలగించారు

దేవరపల్లి: యర్నగూడెంలోని ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలోని విద్యుత్తు నియంత్రిక చుట్టూ అల్లుకున్న పొదలు తొలగించడానికి ఎట్టకేలకు అధికారులు ముందుకొచ్చారు. జాతీయ రహదారిని ఆనుకుని నియంత్రిక ప్రమాదకరంగా ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఈనాడులో ఆదివారం 'పొదలు పెరిగి.. నియంత్రిక మునిగి' శీర్షికతో చిత్ర వార్త ప్రచురితం అయ్యింది. దీనిపై ఏఈ సురేష్ స్పందించారు. సిబ్బందితో పొదలు తొలగించి సమస్యను పరిష్కరించారు.

తీగలు సరి చేశారు..!

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడి మండలంలోని వేగేశ్వరపురం గోదావరి తీరానికి వెళ్లే రహదారిలో ఐదేళ్ల వరి ఈదురు గాలుల తీవ్రతకు స్తంభాల నుంచి తెగిన విద్యుత్తు తీగలను విద్యుత్తుశాఖ అధికారులు సరి చేశారు. దీనిపై గత నెల 25న 'ఈనాడు'లో ప్రచురితమైన 'తీగలు తెగి.. చీకట్లు అలుముకుని' శీర్షికన కథనానికి విద్యుత్తుశాఖ ఏఈ శ్రీనివాసు స్పందించారు. తెగిన తీగలను స్తంభాలకు సరిచేయించారు. వాటికి విద్యుత్తు దీపాలను అమర్చారు. దీంతో రాకపోకలు సాగించే వారి అవస్థలు తీరాయి.

గ్రామంలో పారిశుద్ధ్య పనులు

గోపాలపురం: వెల్లచింతలగూడెం పంచాయతీ పరిధి గ్రామాల్లో అధ్వాన పారిశుద్ధ్య పనులు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై మేమున్నాం మీకు తోడుగాలో ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి సాంబమూర్తి స్పందించారు. మంగళవారం గ్రామంలోని పలు వీధుల్లో కార్మికులతో మురుగు కాలువల శుభ్రం, చెత్తచెదారం తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు



తాళ్లపూడిలో పొలాన్ని పరిశీలిస్తున్న రైతులు, అధికారులు

తాళ్లపూడి, పెరవలి: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టిందని మండల వ్యవసాయాధికారి రుచిత తెలిపారు. పోచవరం, తాడిపూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యాన్ని నచ్చిన మిల్లులకు అమ్ముకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. డీఏవో ఏఓ వెంకప్పబాబు, హెచ్ఈవో పుష్ప, జేవీవో ప్రసాద్, వ్యవసాయ సహాయకులు భార్గవ్, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు. ★ తక్కువ పెట్టుబడితో రైతులు అధిక దిగుబడులు సాధించడం కోసమే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏవో కిరణ్ పేర్కొన్నారు. పెరవలి మండలం కొత్తపల్లిగ్రహారంలో కార్యక్రమం నిర్వహించారు.

గోపాలపురం, నల్లజర్ల: సగ్గొండ, గంగోలు పంచాయతీ పరిధి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ప్రకృతి వ్యవసాయ, మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది ఆయా పంటలకు సంబంధించిన పలు అంశాలు వివరించారు. క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏవో రాజారావు, ధరిణ్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ★ కవులూరు, అనంతపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖ అధికారులు నిర్వహించారు. క్షేత్ర సందర్శన చేసి వరిపొలాలను పరిశీలించారు. నత్రజని ఎరువులు వాడకాన్ని తగ్గించాలన్నారు. మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్, ఉద్యాన శాఖాధికారిణి బబిత, కృషి విజ్ఞాన కేంద్రం డా.కరుణశ్రీ, ఏఈవో పుష్పలత, సుధీర్, దుర్గా సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టమైన మిల్లుకే ధాన్యం

సర్కారు నిర్ణయంతో అన్నదాతల్లో హర్షం
డివిజన్లో 78 మిల్లుల్లో విక్రయాలు

కొవ్వూరుకు చెందిన శ్రీనివాసరావు తన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే బ్రాహ్మణగూడెం మిల్లుకు తరలించాలని సూచించారు. అంత దూరం వెళ్లలేని పరిస్థితిలో ఆ రైతు స్థానిక కమీషనుదారుకు బస్తాకు రూ.200 వరకు తగ్గించి విక్రయించుకోవాల్సి వచ్చింది. దొమ్మేరుకు చెందిన ఎం.రామారావు గత ఖరీఫ్‌లో ధాన్యాన్ని చాగల్లు తీసుకెళ్లాలని ఆన్‌లైన్ ద్వారా చెప్పారు. ఎంతో కష్టపడి ధాన్యం తీసుకెళ్తే తేమ శాతం ఎక్కువగా ఉందని, మిల్లుకు తరలించే ధర ఇవ్వలేమని చెప్పడంతో ఆ రైతుకు నష్టమే మిగిలింది. ఇలా దూరంగా ఉన్న కొనుగోలు కేంద్రానికి ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు తరలించలేక నష్టపోయారు. దీని నివారణకు కూటమి చర్యలు తీసుకోవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైసు మిల్లుకు ట్రాక్టరుపై తెచ్చిన ధాన్యం

కొవ్వూరు పట్టణం, గోపాలపురం, న్యూస్‌టుడే: రైతు భరోసా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని.. ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ అంటూ గత వైకాపా ప్రభుత్వం అన్నదాతలను అవస్థలకు గురిచేసింది. ఆ అయిదేళ్లలో పండించిన పంటను సొమ్ము చేసుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. తేమ శాతం, రవాణా ఛార్జీల రూపంలో వ్యవసాయం అన్ని రకాలుగా నష్టమే వచ్చింది. ప్రస్తుతం కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయంతో కర్షకుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రైతులు తమకు నచ్చిన, దగ్గరలోని మిల్లుల్లో ధాన్యాన్ని అమ్ముకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది.

● కొవ్వూరు డివిజన్లో మండలాలు:	9
● వరి సాగులో ఉన్న హెక్టార్లు	: 36,332
● సాగు చేసే రైతులు	: 34,504
● ఖరీఫ్‌లో ధాన్యం దిగుబడి లక్ష్యం	: 264564.9 మెట్రిక్ టన్నులు
● ధాన్యం మిల్లులు	: 78

రైతన్నలకు ఎంతో మేలు



గత వైకాపా పాలనలో ధాన్యాన్ని విక్రయించుకునే ప్రక్రియలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నిర్ణీత మిల్లుకే ధాన్యాన్ని తీసుకెళ్లాల్సి వచ్చేది. అక్కడ మిల్లర్లు చెప్పిన ధరకే విక్రయించాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం తమకు నచ్చిన మిల్లులో పంటను విక్రయించుకునే అవకాశం కల్పిస్తూ నిర్ణయం ఎంతో మేలు చేస్తుంది. – కేటీకే రంగారావు, దొమ్మేరు

ప్రభుత్వ నిర్ణయం మేరకే..



రైతులు పండించిన ధాన్యాన్ని సమీపంలోని మిల్లుల్లో విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాయితీపై టార్పాలిన్లు, బరకాలు, పిచికారీ యంత్రాలు కూడా అందించే అవకాశం ఉంది. ఈ ఖరీఫ్ నుంచే విక్రయించడానికి చర్యలు తీసుకుంటున్నాం.
– వి.చంద్రశేఖర్, సహాయ వ్యవసాయ సంచాలకులు, కొవ్వూరు

గాంధీ జీవితం ఆదర్శం



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

నిడదవోలు: గాంధీ జీవితం తరతరాలకు ఆదర్శనీయమని విశ్రాంత మండల విద్యాశాఖాధికారి కోడి నాగేశ్వరరావు అన్నారు. నిడదవోలు వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్, మనోజ్ఞ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మనోజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల ప్రధానాచార్యురాలు డా. రుద్ర, ట్రస్ట్ నిర్వాహకురాలు విజయశ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.ఉషారాణి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ జె.శోభారాణి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం



తాళ్లపూడి: పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి నెలా రూ.4 వేలు పింఛను ఇచ్చి పేదలను ఆదుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, బర్ల శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి, ప్రక్కిలంక గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. తాళ్లపూడిలో జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 201 మంది సిబ్బంది ఈ పంపిణీలో పాల్గొన్నారని తెలిపారు. మండల తెదేపా అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, ఎంపీడీవో రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చాగల్లు, గోపాలపురం, ఉండ్రాజవరం: కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అధికారులు మంగళవారం తెల్లవారుజాము నుంచే లబ్ధిదారులకు అందజేశారు. చాగల్లులో 97.33 శాతం పింఛను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. 9,378మంది లబ్ధిదారులకు గాను 9,121 మందికి రూ.3.97 కోట్లను అందచేశామన్నారు. ★ గోపాలపురం మండల పరిధిలోని 18 పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ 98 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. మండలంలోని 9,136 మందికి సంబంధించి మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 8,923 మందికి రూ.3,77,15,500 నగదు పంపిణీ చేశామన్నారు. 187 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు. ★ ఉండ్రాజవరం మండలంలోని సూర్యారావుపాలెంనకు చెందిన వృద్ధురాలు బండి నారాయణమ్మ అనారోగ్యంతో పశ్చిమగోదావరి జిల్లా తణుకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి రత్నం ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేయడంతో పలువురు ఆయన్ను అభినందించారు.

ఇవేం దారులు?



వేలివెన్ను నుంచి కాల్దరి వెళ్లే రహదారిలో భారీగా గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారి మీదుగా నిత్యం వందల సంఖ్యలు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. విద్యాసంస్థలు ఉండటంతో పాఠశాలల బస్సులు అధికంగా తిరుగుతుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు. అధికారులను వివరణ కోరగా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

సామాజిక భద్రత ప్రభుత్వ బాధ్యత



పింఛను అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: సామాజిక భద్రత-ప్రభుత్వ బాధ్యత అని, అందుకే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి పింఛన్ల పంపిణీ చేపడుతున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరంలో పింఛన్లను పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,39,021 మందికి రూ.101.95 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంపీడీవో సామ్యేల్, తహసీల్దారు నాగరాజు నాయక్, కె.శ్రీను, పి.వెర్రిబాబు, బి.బుజ్జి, రాంబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ★ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు లబ్దిదారుల్లో మనోధైర్యాన్ని నింపుతున్నాయని మంత్రి అన్నారు. విజ్జేశ్వరానికి చెందిన చడల్లా సత్యనారాయణకు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల కోటాలో రూ.15వేలు పింఛన్ అందించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		12,000
పాతకాయ:	గండేరా	17,500
	గటగట	15,500
కొత్తకాయ:	గండేరా	16,500
	గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		16,000-17,000
కొత్త (పచ్చి) కాయ		15,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		3,750
కిలో		260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్ట్	200-00
స్కిన్‌లెస్	228-00

వృద్ధులకు వితరణ

నిడదవోలు: కమిటీ కుర్రోళ్లు చిత్ర హీరో యశ్వంత్ పెండ్యాల పుట్టినరోజు సందర్భంగా నిడదవోలు పట్టణంలోని చర్ల సుశీలా వృద్ధాశ్రమంలో వృద్ధులకు మంగళవారం దుప్పట్లు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించి, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు చర్ల మృదులకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

నల్లజర్ల: విజయవాడ వరద బాధితులకు పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ (నల్లజర్ల), సంఘమిత్ర పాఠశాల(దూబచర్ల) సమకూర్చిన దుప్పట్లను సినీనటుడు మొల్లేటి బాలాజీ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. పాయకాపురం కండ్రిగ కాలనీకి చెందిన 1000 కుటుంబాలకు వీటిని అందజేశారు. అంబటి శ్రీనివాసరావు, గురుమూర్తి, దేవరాజు అచ్యుతరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

తాళ్లపూడి: ప్రక్కిలంకలో సువ్వారి సరోజినికి మానవత సంస్థ తరఫున వైద్యఖర్చుల నిమిత్తం రూ. 6వేలు సాయం అందించినట్లు అధ్యక్షుడు సురేష్, రీజనల్ ఛైర్మన్ చంద్రయ్య తెలిపారు.

స్వచ్ఛ సంకల్పానికి శ్రీకారం

పెరవలి: గ్రామంలో యువత, స్వచ్ఛంద సంస్థలు ఇంటింటా తిరిగి మహిళలకు బొట్టు పెట్టి పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని వినూత్నంగా ప్రచారం చేశారు. గ్రామంలో డ్రెయిన్లను యంత్రాలతో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి అగ్రహారం ఆర్యవైశ్య సేవాసంఘం, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, వశిష్టా వినియోగదారులు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

పెరవలి, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని పెరవలి ఎస్సై అప్పారావు తెలిపారు. దీనిలో భాగంగా పిట్టలవేమవరంలో బాణసంచా తయారు చేసే ఇద్దరిని ముందుస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

మద్యం దుకాణాలకు తొలిరోజు 200 దరఖాస్తులు



- అడ్డొచ్చిన అమావాస్య సెంటిమెంట్
- మొత్తం లక్షకు పైగా అర్జీలు రావొచ్చని అంచనా
- నాన్ రీఫండబుల్ రుసుముల రూపేణా రూ.2 వేల కోట్ల ఆదాయం!
- ఆన్‌లైన్‌లో అర్జీల స్వీకరణకు ప్రత్యేక వెబ్‌పోర్టల్

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో కొత్తగా మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా, తొలిరోజైన మంగళవారం 200కు పైగా వచ్చాయి. వీటిలో ఆఫ్‌లైన్ విధానంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్లలో నేరుగా సమర్పించినవే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,396 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి ఎక్సైజ్ శాఖ సోమవారం అర్ధరాత్రి తర్వాత నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం అమావాస్య కావడంతో వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. మొత్తంగా లక్షకు పైగా దరఖాస్తులు రావొచ్చని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుము రూపంలోనే దాదాపు రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. 2017లో 4,380 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, వాటికి సగటున 18 చొప్పున మొత్తం 78 వేల దరఖాస్తులు అందాయి. ఈసారి 3,396 దుకాణాలకుగానూ ఒక్కో దానికి సగటున 30 వరకు దరఖాస్తులు పడతాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 9 వరకు గడువు ఉండగా, చివరి మూడు రోజుల్లో ఎక్కువ దరఖాస్తులు పడే అవకాశముంది.

ఆన్‌లైన్‌లో అయితే..

మద్యం దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్ తీసుకొచ్చింది. hpfsproject.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫోన్‌నంబరును యూజర్ ఐడీగా వినియోగించుకొని, పాస్‌వర్డ్ సృష్టించుకోవాలి. తర్వాత యూజర్ నేమ్, పాస్‌వర్డ్ లేదా ఓటీపీతో లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన సమగ్ర యూజర్ మాన్యువల్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దరఖాస్తు విధానానికి సంబంధించిన ఉత్తర్వులు కూడా వెబ్‌సైట్‌లో పెట్టారు.

విశాఖలో గరిష్ఠం

ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసిన 3,396 దుకాణాల్లో 2,261 (66.57 శాతం) మండలాల్లోనే ఏర్పాటు చేయనుంది. నగరపాలక సంస్థల పరిధిలో 511, పురపాలక సంఘాల్లో 499, నగర పంచాయతీల్లో 125 చొప్పున నోటిఫై చేసింది. అత్యధికంగా విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలో 136, గుంటూరులో 52 చొప్పున ప్రతిపాదించింది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా తిరుపతిలో 227, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 40 దుకాణాలను నోటిఫై చేసింది.

అందుబాటులో కోరుకున్న మద్యం బ్రాండ్లు

నూతన మద్యం విధానంలో భాగంగా దుకాణాల్లో ప్రీమియం, మల్టీ నేషనల్ బ్రాండ్లను అందుబాటులో ఉంచనుంది. వినియోగదారులు కోరుకునే బ్రాండ్లన్నీ విక్రయిస్తారు. సరఫరా కంపెనీల నుంచి మద్యం కొనుగోలు కోసం చెల్లించే బేసిక్ ప్రైస్ (మూల ధర)ను చెల్లించేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీ వేయనుంది. 90 రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం మద్యంపై 10 రకాల పన్నులు విధిస్తుండగా, తాజా విధానంలో వాటిని ఆరుకు కుదించారు. ఎక్సైజ్ డ్యూటీ, రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్, వ్యాట్, స్పెషల్ మార్జిన్, అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం, రౌండింగ్ ఆఫ్ పన్నులు ఉంటాయి.

జిల్లాల వారీగా అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో నోటిఫై చేసిన మద్యం దుకాణాల సంఖ్య

జిల్లా	దుకాణాలు
శ్రీకాకుళం	158
విజయనగరం	153
పార్వతీపురం మన్యం	52
అల్లూరి సీతారామరాజు	40
విశాఖపట్నం	155
అనకాపల్లి	136
కాకినాడ	155
డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ	133
తూర్పుగోదావరి	125
పశ్చిమగోదావరి	175
ఏలూరు	144
కృష్ణా	123
ఎన్టీఆర్	113
గుంటూరు	127
బాపట్ల	117
పల్నాడు	129
ప్రకాశం	171
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	182
కర్నూలు	99
నంద్యాల	105
అనంతపురం	136
శ్రీసత్యసాయి	87
వైఎస్సార్	139
అన్నమయ్య	111
చిత్తూరు	104
తిరుపతి	227

పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు ఓకే

నదీగర్భంలో జిల్లా ఇసుక కమిటీ ద్వారా తవ్వకాలు

పట్టాదారుకు టన్నుకు రూ.60 చొప్పున చెల్లింపు

నదీగర్భం బయట పట్టాదారే తవ్వి, విక్రయించేందుకు అవకాశం

గరిష్ఠంగా టన్ను రూ.250కి మించి అమ్మకూడదు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నదీగర్భంలో, నదిని ఆనుకొని ఉన్న పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇసుక కొరత తీర్చేందుకు ఆయా భూముల్లో మేటవేసిన ఇసుకను తవ్వి, విక్రయించేందుకు అవకాశం కల్పించింది. నదీగర్భం లోపల ఉండే భూముల్లోని ఇసుకను జిల్లాస్థాయి ఇసుక కమిటీ ద్వారా తవ్వి విక్రయించనుండగా, నదీగర్భం బయట ఉండే భూముల్లో నేరుగా పట్టాదారే తవ్వకాలు చేసేందుకు వీలు కల్పించారు. ఈ మేరకు గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయి. పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు మూడు రకాలుగా వీలు కల్పించారు.

పట్టాదారుకు ఇలా..

■ నదీగర్భం లోపల భూముల్లో ఇసుక మేటలు ఉంటే.. పట్టాదారు దరఖాస్తు చేసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్‌డీడ్ అందజేయాలి. అందులో ఇసుక తవ్వకాలకు అంగీకరిస్తున్నట్లు పేర్కొనాలి.

■ వీటిని జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఆదేశాలతో తహసీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారి, భూగర్భజలశాఖ అధికారి, జలవనరులశాఖ ఈఈ, జిల్లా గనులశాఖ అధికారితో కూడిన బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తుంది.

■ తర్వాత ఆ భూముల్లో ఇసుక తవ్వకాలకు మైనింగ్ ప్లాన్, పర్యావరణ, పీసీబీ అనుమతులను కలెక్టర్ పేరుతో జిల్లా గనులశాఖ అధికారి తీసుకుంటారు. ఈ వ్యయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది.

■ అనుమతులు వచ్చాక, పట్టాదారుతో జిల్లా ఇసుక కమిటీ ఒప్పందం చేసుకుంటుంది. తర్వాత ఈ కమిటీ ద్వారా ఇసుక తవ్వకాలు చేపట్టి ఇలా తవ్విన ఇసుకలో టన్నుకు రూ.60 చొప్పున పట్టాదారుకు చెల్లిస్తారు.

■ ఈ ఇసుక నిల్వలను శాండ్ పోర్టల్‌లో చూపించి, ఆన్‌లైన్ బుకింగ్‌తోనే విక్రయిస్తారు.

ప్రభుత్వ పనులకే..

■ నదీగర్భం బయట ఉన్న భూముల్లో.. గతంలో వరదల వల్ల ఇసుకమేటలు వేసి, ముందుగా మళ్లీ వరదలతో ఇసుక వచ్చే అవకాశం లేని భూముల్లో జిల్లా ఇసుక కమిటీ ద్వారానే తవ్వకాలు జరిపిస్తారు. ఇలాంటి భూముల్లో తవ్వకాలకు అనుమతులన్నీ జిల్లా గనులశాఖ అధికారే తీసుకుంటారు. ఈ ఇసుకను ప్రభుత్వ పనులకే వినియోగిస్తారు.

అనుమతులు తెచ్చుకోవాల్సింది పట్టాదారే

■ నదీగర్భం బయట భూముల్లో గతంలో వరదలతో ఇసుక మేటలు ఏర్పడి, మళ్లీ భవిష్యత్‌లో వరదల వల్ల ఇసుక వచ్చే అవకాశం ఉన్నచోట్ల.. పట్టాదారే ఇసుక తవ్వకాలు చేసేందుకు అవకాశం కల్పిస్తారు. అయితే వీటికి 5 కి.మీ. పరిధిలో ప్రభుత్వ రీచ్‌లు గానీ, పూడిక రేవులు గానీ ఉండకూడదు. ■పట్టాదారు దరఖాస్తు చేసుకుంటే, ఆయా శాఖల అధికారుల బృందం పరిశీలించి, జిల్లా ఇసుక కమిటీకి నివేదిక ఇస్తారు, అది అనుమతిస్తుంది. ■తర్వాత పట్టాదారు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. ■అనంతరం పట్టాదారు తన భూమిలో ఇసుక తవ్వి, గనులశాఖ పోర్టల్ ద్వారా టన్ను రూ.250కి విక్రయించాలి. ఇందులో టన్నుకు రూ.88 సీనరేజి కింద మినహాయిస్తారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరకు రెక్కలు

● విజయవాడలో ఇక రూ.1,918

ఈనాడు వాణిజ్య విభాగం: రెస్టారెంట్లలో, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను ఈ నెల 1 నుంచి (మంగళవారం) పెంచినట్లు చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. హైదరాబాద్‌లో ఈ సిలిండర్ ధర రూ.1919 నుంచి రూ.48 పెరిగి రూ.1967కు చేరింది. విజయవాడలో రూ.1,870 నుంచి రూ.48 అధికమై రూ.1,918కి చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సిలిండర్ ధరను ఆగస్టు, సెప్టెంబరులలో కూడా పెంచారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా వీటి ధరలను కంపెనీలు సవరిస్తుంటాయి. ఇళ్లలో వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలో మార్పులేమీ చేయలేదు.

పేదలకు రాయితీపై కందిపప్పు, పంచదార

● రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచే మొదలైన పంపిణీ

రేషన్ దుకాణాల ద్వారా తెల్లకార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార పంపిణీ 16 నెలల తర్వాత మళ్లీ మొదలైంది. దసరాకు ముందే రూ.67కు కిలో కందిపప్పు, రూ.17కు అరకిలో పంచదార పంపిణీ చేయాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా 1.48 కోట్ల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గతేడాది జూన్ నుంచి కందిపప్పు పంపిణీ నిలిపివేయడంతో అప్పటి నుంచి కార్డుదారులు కిలో రూ.170కు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక కందిపప్పు పంపిణీపై దృష్టి పెట్టింది. మూడు నెలల పాటు సరఫరా చేసేందుకు రెండుసార్లు టెండర్లు పిలిచారు. ఇటీవలే ఖరారు చేసి అక్టోబరు నుంచి కార్డుదారులకు పంపిణీ ప్రారంభించారు. సరఫరాలో జాప్యం కారణంగా కొన్ని జిల్లాలకు కందిపప్పు నిల్వలు ఆలస్యంగా చేరినా.. మిగతాచోట్ల మంగళవారం నుంచి పంపిణీ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.


వైకాపా హయాంలో కిలో కోత పెట్టి..

2019 వరకు రేషన్ కార్డుదారులకు రాయితీపై కిలో రూ.40 చొప్పున రెండు కిలోల కందిపప్పు ఇచ్చేవారు. వైకాపా రావడంతోనే కోత పెట్టి కేవలం కిలో చొప్పున పంపిణీ చేసింది. 2020 ఏప్రిల్ నుంచి కిలో ధర రూ.67కు పెంచింది. అయినా పూర్తిస్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేయలేదు. ప్రతి నెలా మొత్తం కార్డుల్లో 25% నుంచి 35% మందికి మాత్రమే పప్పు అందేది. 2021 నవంబరు నుంచి 2023 డిసెంబరు వరకు చూస్తే సగటున 30% కుటుంబాలకే కందిపప్పు ఇచ్చారు. జూన్ నుంచి పంపిణీ నిలిపివేశారు. ప్రతి నెలా ధరలు పెరిగి వినియోగదారులపై భారం పడుతున్నా పట్టించుకోలేదు.

జనవరి నుంచి తృణధాన్యాల పంపిణీకి ప్రణాళికలు: మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార అందిస్తామని.. వచ్చే ఏడాది జనవరి నుంచి తృణధాన్యాలు కూడా పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలో మంగళవారం ఆయన కార్డుదారులకు రాయితీపై కిలో కందిపప్పు, అర కిలో పంచదార అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎందుకా విజ్ఞానం?



మంచి వ్యక్తిత్వం లేనివారికి ఎంతటి విజ్ఞానం ఉన్నా అది దుష్ట శక్తి కిందే లెక్క. మనం ప్రపంచంలో తరచూ చూస్తుండే 'మహా తెలివైన దొంగలు', 'పెద్దమనుషుల్లాంటి వంచకులు' ఈ కోవలోని వారే!

– మహాత్మా గాంధీ

ఈఎస్‌ఐలో వైద్య సేవలపై ఆరా

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: నగరంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిని మంగళవారం భాజపా నాయకులు సందర్శించారు. భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ఇతర నాయకులు ఆసుపత్రిలోని ఆయా విభాగాలను పరిశీలించారు. ఇక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలపై సిబ్బందిని ఆరా తీశారు. రోజూ ఓపీ ఎంత ఉంటుంది? అత్యవసర కేసులెన్ని వస్తున్నాయి? ప్రస్తుతం అందుబాటులో ఉన్న పడకలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ కొత్త భవనాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపిశ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సత్యసాయిరామ్ తదితరులు ఉన్నారు.

గణేష్ శోభాయాత్ర అల్లర్ల కేసులో 21 మంది అరెస్టు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : కొవ్వూరు ఒకటో వార్డు రాజీవ్ కాలనీలో వినాయక విగ్రహ శోభాయాత్ర సందర్భంగా చోటుచేసుకున్న అల్లర్లు, కొట్లాటల కేసులో 21 మంది ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వి.విశ్వం మంగళవారం తెలిపారు. వీరిలో శ్రీరామా కాలనీకి చెందిన ఆరుగురు, రాజీవ్ కాలనీకి చెందిన 15 మంది ఉన్నారన్నారు. డీఎస్పీ పర్యవేక్షణలో వీరిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని, అల్లర్లకు కారణమైన వారెవరైనా ఉంటే అరెస్టు చేస్తామన్నారు. గత నెల 20న రాజీవ్‌కాలనీ నుంచి వినాయకుడి విగ్రహం ఊరేగింపు శ్రీరామాకాలనీకి చేరుకున్న సమయంలో అల్లరి మూకలు రాళ్లు విసిరిన అల్లర్లకు దిగిన విషయం తెలిసిందే. ఆ నేపథ్యంలో మూడు రోజులపాటు అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది. రెండు కాలనీల్లో ప్రత్యేక పోలీసు బృందాలు, సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో 144 సెక్షన్ విధించారు. ప్రత్యేక బలగాల నడుమ ఊరేగింపు, నిమజ్జనం పూర్తి చేయించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు బందోబస్తు కొనసాగించాల్సి వచ్చింది. కాలనీ పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహిస్తూనే 100 మందికి నోటీసులు ఇచ్చారు. ఆ రెండు కాలనీల్లో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి.

జాడలేని చిరుత.. గుర్తించేందుకు రెండు బృందాలు

దివాన్‌చెరువు (రాజానగరం), న్యూస్‌టుడే: చిరుతపులి జాడ దివాన్‌చెరువు అభయారణ్యం, కడియం ప్రాంతంలోని నర్సరీలు, రావులపాలెం, గోదావరి నదీ తీరంలో.. ఎక్కడా కనిపించడం లేదని తూర్పుగోదావరి జిల్లా అటవీశాఖాధికారిణి ఎస్.భరణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తించేందుకు రెండు బృందాలు ఆయా ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నాయన్నారు. గత నెల 19న దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్టు ట్రాప్ కెమెరాలో నమోదైందన్న ఆమె.. 24వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో కడియం నుంచి వీరవరం వెళ్లే రోడ్డులోని దోసాలమ్మకాలనీ దగ్గర ఎన్‌ఎస్‌టీసీ నర్సరీలో పాదముద్రలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆ రోజే వర్షం పడటంతో పాదముద్రల ఆనవాళ్లు చెరిగి పోయాయన్నారు.

నేటి నుంచి పుష్కర వనంలోకి సందర్శకుల అనుమతి

గోదావరి మహాపుష్కర వనంలోకి బుధవారం నుంచి సందర్శకులను అనుమతిస్తున్నట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. చిరుత కదలికల నేపథ్యంలో గత నెల 10వ తేదీ నుంచి దివాన్‌చెరువు అభయారణ్యం, పుష్కరవనంలోకి అనుమతులు నిలిపేశారు. ప్రస్తుతం చిరుత జాడ కనిపించకపోవడంతో పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు.

పలువురికి మానవత సాయం



నగదును అందచేస్తున్న మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంగళవారం ఆర్థిక సాయం చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చీపురుగూడెం గ్రామానికి చెందిన వసంతాడ మధుబాబు దంపతులకు రూ.15 వేలు నగదును అందచేశారు. ఈ దంపతులకు నల్లజర్ల జిల్లా ఉన్నత పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులంతా సమకూర్చిన రూ.45 వేలు నగదుతోపాటు అదే గ్రామానికి చెందిన చెల్లు తిరుమల శ్రీనివాస్ రూ.5 వేలును అందచేశారు. అనంతపల్లి గ్రామానికి చెందిన తెప్పల అబ్బులు, సరోజిని, సింగదాసు కమలకుమారి, తగరం వెంకమ్మలకు ఒక్కొక్కరికి రూ.4 వేలు నగదు చొప్పున రూ. 16 వేలు మానవత సంస్థ సభ్యులు అందచేశారు. కార్యక్రమంలో మండల మానవత ఛైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, ముళ్లపూడి వెంకటరత్నం, ఐ.డి.వి.అప్పారావు, చెల్లు వీరవెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా చేయాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : తిరుపతి లడ్డూ కల్తీ అంశంపై సుప్రీంకోర్టు స్పందించిన విధానంతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవులకు రాజీనామా చేయాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించారని, కల్తీ నెయ్యి వాడనప్పుడు ప్రసాదం ఎందుకు అపవిత్రమవుతుందన్నారు. పథకం ప్రకారం అలజడి సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూశారన్నారు. పవన్‌కల్యాణ్ హిందువులకు క్షమాపణ చెప్పాలన్నారు.